**నేటి కందం-నేటికి అందం**

ప్రేరణ గలిగించెడి గతి
తీరగు యొప్పందములను తీరిచి దిద్దన్
భారతమును,తైవానును
సారస నయనుండు బ్రోచి సంరక్షించున్ !!

(భారత్ తైవాన్ దేశాల మధ్య పలు రంగాల్లో ఒప్పందాలు కుదరడంతో రెండు దేశాల లోని ప్రజలు చాలా సంతోషిస్తున్నారు. ఈ ఒప్పందాల వల్ల రెండు దేశాలకు ఎన్నో ఆర్థిక ప్రయోజనాలు చేకూరుతాయని ధృవీకరించారు)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం


తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

**చురక**

రాఖీ కడితేనే ఇకా
రాజకీయ సంరక్షా
అంతా రాజీ మంత్రం
ఆగేనా ఆమె శిక్ష.
హస్తంలో ఏదైనా
అద్భుతం జరుగవచ్చు
క్రమశిక్షణ స్వేచ్ఛ పేర
కట్టుతప్పి కరుగవచ్చు.

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ ఆదివారం 30-8-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:24 పేజీలు:6 వెల: రూ.1/-


# పర్యాటకానికి కొత్త ఊపు

**-తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి గోల్ఫ్ కోర్సులు..**
**-షామీర్‌పేట సమీపంలోని జవహర్‌నగర్‌లో 130 ఎకరాల్లో గోల్ఫ్ కోర్సు..**
**-కృష్ణా తీరం సోమశిలలో మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు-మంత్రి జూపల్లి కృష్ణారావు**




హైదరాబాద్, ఆగష్టు 29:క్రీడా పర్యాటకాన్ని మరింత విస్తరించి తెలంగాణను అంతర్జాతీయ స్థాయి గోల్ఫ్ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. షామీర్‌పేట సమీపంలోని జవహర్‌నగర్‌లో 130 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక గోల్ఫ్ కోర్సు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోందని వెల్లడించారు. అలాగే కృష్ణా నది తీరంలోని సోమశిలలో మరో అంతర్జాతీయ ప్రమాణాల గోల్ఫ్ కోర్సు అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లోని గోల్కొండ గోల్ఫ్ క్లబ్‌లో నిర్వహించిన 12వ తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ పోటీలు సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. క్రీడ, ప్రకృతి, పర్యాటకాన్ని సమన్వయం చేస్తూ తెలంగాణకు కొత్త పర్యాటక అవకాశాలు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

**సోమశిలకు ప్రత్యేక గుర్తింపు**

కృష్ణా నది తీరంలో, నల్లమల అటవీ ప్రాంతానికి సమీపంగా ఉన్న సోమశిల సహజసిద్ధమైన అందాలతో ప్రత్యేకతను సంతరించుకుందని జూపల్లి అన్నారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌కు సమీపంలో ఉండటం వల్ల అక్కడ గోల్ఫ్‌తో పాటు ప్రకృతి పర్యాటకాన్ని అభివృద్ధి చేసే అవకాశం ఉందని తెలిపారు. క్రీడా పర్యాటకానికి సోమశిలను ప్రత్యేక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిలో ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు.

**గోల్ఫ్‌తో పాటు తెలంగాణ వారసత్వం**

తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ కేవలం క్రీడా పోటీ మాత్రమే కాదని, రాష్ట్ర చారిత్రక వారసత్వం, పర్యాటక సామర్థ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసే వేదిక అని మంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్‌కే కాకుండా రాష్ట్రంలోని సరస్సులు, అడవులు, నదులు, కోటలు, రాజభవనాలు వంటి పర్యాటక ప్రాంతాలకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. గోల్కొండ కోట నేపథ్యంలో జరిగే ఈ టోర్నీ తెలంగాణ చరిత్ర, సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు. దేశ, విదేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనడం ద్వారా తెలంగాణ పర్యాటక రంగానికి మరింత ప్రచారం లభిస్తుందని అభిప్రాయపడ్డారు.

**క్రీడా, పర్యాటక ప్రోత్సాహానికి కపిల్ దేవ్ సేవలు**

తెలంగాణలో పర్యాటక, క్రీడా రంగాల అభివృద్ధికి మాజీ క్రికెట్ కెప్టెన్ కపిల్ దేవ్ అనుభవం, సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు జూపల్లి తెలిపారు. ఆయన భాగస్వామ్యం ద్వారా తెలంగాణ పర్యాటక విశేషాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత విస్తృతంగా ప్రచారం పొందుతాయని అన్నారు. కపిల్ దేవ్ మాట్లాడుతూ తెలంగాణ గోల్కొండ మాస్టర్స్‌కు తెలంగాణ పర్యాటక శాఖ అందిస్తున్న సహకారాన్ని అభినందించారు. ఈ పోటీలు హైదరాబాద్, తెలంగాణను ప్రముఖ గోల్ఫ్ పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.

**రూ.కోటి బహుమతికి 132 మంది పోటీ**

సెప్టెంబర్ 1 నుంచి 4 వరకు తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ నిర్వహించనున్నారు. మొత్తం 132 మంది గోల్ఫర్లు రూ.కోటి బహుమతి కోసం పోటీపడనున్నారు. ఇందులో దేశంలోని ప్రముఖ క్రీడాకారులతో పాటు విదేశీ గోల్ఫర్లు కూడా పాల్గొంటారు. ఈ టోర్నీకి అధికారిక ప్రపంచ గోల్ఫ్ ర్యాంకింగ్ పాయింట్లు కూడా లభించనున్నాయి. 2015 నుంచి ఈ టోర్నీకి తెలంగాణ ప్రభుత్వం మద్దతు అందిస్తోందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డీపీ వరల్డ్ ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా సీఈఓ అమన్‌దీప్ జోహల్, చెక్ రిపబ్లిక్‌కు చెందిన అంతర్జాతీయ గోల్ఫర్ స్టెపాన్ డానెక్, హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులను తేలికగా తీసుకోవద్దు

## -మంత్రి దామోదర రాజనర్సింహ

ఇ-హైదరాబాద్, ఆగస్టు 29: సీజనల్ వ్యాధులపై మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈరోజు(శనివారం) రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలో సీజన్ వ్యాధుల పరిస్థితిపై ఆరోగ్య శాఖ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డెంగ్యూ, మలేరియా, చికన్‌గున్యా కేసులు తగ్గుముఖం పట్టాయన్నారు. గతేడాదితో పోలిస్తే డయేరియా, డిసెంట్రీ కేసులు కూడా తక్కువగా నమోదు అయినట్లు తెలిపారు.

టైఫాయిడ్ కేసులు స్వల్పంగా పెరిగాయన్నారు. కేసులు పెరుగుతున్న జిల్లాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. ఫీవర్ సర్వేలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

ప్రతి జ్వరం కేసును పర్యవేక్షించి.. అవసరమైన పరీక్షలు, చికిత్స అందించాలని మంత్రి తెలిపారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో మందులు, టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఐఎల్ఐ, స్వైన్‌ఫ్లూ కేసులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఐఎల్ఐ కేసులపై రోజువారీగా పర్యవేక్షించాలని రాజనర్సింహ తెలిపారు. అయితే, ప్రస్తుతం రాష్ట్రంలో సీజనల్ ఇన్‌ఫ్లూయెంజా పూర్తిగా నియంత్రణలోనే ఉందని మంత్రికి అధికారులు వివరించారు.

దోమల నివారణ చర్యలను మరింత ముమ్మరం చేయాలని దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు. ప్రతి శుక్రవారం 'డ్రై డే' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. నిల్వ నీటి తొలగింపు, లార్వా నిర్మూలన, ఫాగింగ్ కొనసాగించాలని సూచించారు. గ్రామాలు, పట్టణాలు, పాఠశాలలు, హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స కంటే.. ముందస్తు నివారణే లక్ష్యమన్నారు. ప్రతి జిల్లాలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. సీజనల్ వ్యాధుల కేసులను ఏమాత్రం తేలికగా తీసుకోవద్దని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు.

# దశాబ్దాల భూ సమస్యకు పరిష్కారం : కోమటిరెడ్డి వెంకటరెడ్డి



సూర్యాపేట, ఆగష్టు 29:దశాబ్దాలుగా పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తూ రైతుల చేతికి పట్టాదారు పాస్‌బుక్‌లు అందించడం ఆనందంగా ఉందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలోని నూతన్‌కల్‌లో సహచర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి నూతన్‌కల్, మద్దిరాల మండలాల పరిధిలోని తొమ్మిది గ్రామాల రైతులకు పట్టాదారు పాస్‌బుక్‌లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పేదలకు పట్టాలతో హక్కును, ఇందిరమ్మ ఇళ్లతో ఆత్మగౌరవాన్ని కల్పిస్తూ ముందుకు సాగుతోందని చెప్పారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల సాయం అందిస్తున్నామని తెలిపారు.

గత ప్రభుత్వ అప్పుల భారం ఉన్నప్పటికీ అభివృద్ధి కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌లో రూ.36 వేల కోట్లతో రహదారుల నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా తుంగతుర్తి నియోజకవర్గంలో ఎర్రపహాడ్ ఎక్స్‌రోడ్ నుంచి దంతాలపల్లి వరకు రూ.96 కోట్లతో రహదారి పనులకు టెండర్లు పూర్తయ్యాయని వెల్లడించారు.

ఇది మాటల ప్రభుత్వం కాదని, చేతల్లో చూపించే ప్రభుత్వమని కోమటిరెడ్డి పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తున్నామని చెప్పారు. రూ.20 వేల కోట్ల రైతు రుణమాఫీతో పాటు రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లోకి నేరుగా నిధులు జమ చేస్తున్నామని తెలిపారు.

గత ప్రభుత్వ అప్పులకు అసలు, వడ్డీలు చెల్లిస్తూనే అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని అన్నారు. కేంద్రం నుంచి నిధులు వచ్చినా, రాకపోయినా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో గుడిసెలు లేని తెలంగాణను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్, జిల్లా కలెక్టర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# సైక్లింగ్ క్రీడతో శారీరక ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ

## -అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఊట్కూరి నరేందర్ రెడ్డి



కరీంనగర్, ఆగష్టు 29: (నేటినిజం ప్రతినిధి) ఆధునిక కాలంలో సైక్లింగ్ క్రీడకు ఆదరణ పెరుగుతోందని, ఈ క్రీడ వల్ల వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు పర్యావరణ సమతుల్యతకు దోహదపడుతుందని కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ హానరరీ చైర్మన్ డాక్టర్ ఊట్కూరి నరేందర్ రెడ్డి అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా సైక్లింగ్ అసోసియేషన్, శాతవాహన లయన్స్ క్లబ్, లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ సంయుక్త నిర్వహణలో చేపట్టిన "రన్ అండ్ రైడ్" కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాభిమానులు, క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రతి ఒక్కరు కనీసం 45 నిమిషాల పాటు శారీరక వ్యాయామం చేస్తూ తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు. అన్ని వయస్సుల వారు సైక్లింగ్ చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సైక్లింగ్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించి సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ పట్టణంలో సైక్లింగ్ క్రీడ పట్ల అవగాహన పెరుగుతుందని, ప్రతి ఒక్కరూ, ముఖ్యంగా యువత సైకిల్ తొక్కడం తమ దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. అతి త్వరలో జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సైక్లింగ్ పోటీలు నిర్వహించి జిల్లా జట్టును ఎంపిక చేస్తామని, ఎంపికైన అభ్యర్థులు తెలంగాణ రాష్ట్ర స్థాయిలో నెగ్గి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సైకిల్ ర్యాలీ కార్యక్రమం కోర్టు వద్ద ప్రారంభమై ఆర్ అండ్ బి చౌరస్తా, తెలంగాణ చౌక్, మంకమ్మ తోట, రాంనగర్, టెలీ-ఫోన్ క్వార్టర్స్ మీదుగా డ్యామ్ కట్టపై చేరి గేట్ల వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో శాతవాహన లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు లయన్ మిట్టపెల్లి మహేందర్, లయన్ నార్ల వేణుగోపాల్, లయన్ మేకల అరవింద్ బాబు, లయన్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్, సైక్లిస్ట్ అఖిల్, లేక్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సఫలం అయ్యారు.

# హైదరాబాద్‌లో గంజాయి చాక్లెట్ల కలకలం.. నిందితుడి అరెస్ట్

హైదరాబాద్, ఆగస్టు 29: నగరంలోని శామీర్‌పేట్‌లో భారీగా గంజాయి చాక్లెట్లు పట్టుపడటం కలకలం రేపింది. యువత, చిన్నారులే లక్ష్యంగా గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి భారీఎత్తున గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన బైద్‌నాథ్, అతడి భార్య పూజారి కొంతకాలంగా శామీర్‌పేట్‌లో నివసిస్తున్నారు. వారు ఓ పాన్‌షాప్ పెట్టుకుని జీవనం కొనసాగిస్తున్నారు. అయితే, అక్రమ మార్గంలో డబ్బు సంపాదించడానికి అలవాటుపడిన వారు.. గంజాయిని చాక్లెట్ల రూపంలో అమ్ముతున్నారు. పాన్‌షాప్ ముసుగులో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు.. సదరు షాప్‌పై దాడి చేశారు. బైద్‌నాథ్‌ను అరెస్ట్ చేసి 25 కేజీల బరువున్న 5,298 గంజాయి చాక్లెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న అతడి భార్య కోసం గాలిస్తున్నట్టు చెప్పారు. ఈ సంఘటనతో అప్రమత్తమైన పోలీసులు పాఠశాలలు, కాలేజీల వద్ద నిఘా పెంచారు. తల్లిదండ్రులు తమ పిల్లలు కొనుగోలు చేసే ఆహార పదార్థాల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు.

# ఓట్ల తొలగింపుపై సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన.. ఎస్ఐఆర్ పై సీఈసీకి లేఖ

హైదరాబాద్, ఆగస్టు 29: : తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా పెద్ద సంఖ్యలో ఓట్ల తొలగింపుపై సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 92.86 లక్షల ఓట్ల తొలగింపుకు సంబంధించిన సమగ్ర పరిశీలన అవసరమని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. సాఎఖీ ప్రక్రియలో భాగంగా ఓటర్ల నుంచి క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరించేందుకు ప్రస్తుతం ఉన్న గడువు సరిపోదని పేర్కొన్నారు. గడువును మరో నాలుగు వారాల పాటు పొడిగించాలని కోరారు.

వలస కూలీలు, రోజువారీ కూలీలు.. తమ ఓటు హక్కు వివరాలను పరిశీలించుకునేందుకు, అవసరమైన పత్రాలను సమర్పించేందుకు అదనపు సమయం ఇవ్వాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లో అధిక సంఖ్యలో ఓటర్లు ఉన్నందున అదనపు సిబ్బంది అవసరమని సూచించారు. ఈ మూడు ప్రాంతాల్లో అదనపు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లను నియమించాలని కోరారు. సాఎఖీ ప్రక్రియను వికేంద్రీకరించాలని సీఈసీకి రాసిన లేఖలో రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# లోయలోకి దూసుకెళ్లిన లారీ




అమరావతి, ఆగష్టు 29:దోర్నాల-శ్రీశైలం ఘాట్ రోడ్డులో లారీ బోల్తా పడిన ఘటన చోటుచేసుకుంది. చిన్నారుట్ల సమీపంలోని ఓ మూలమలుపు వద్ద పీవోపీ లోడ్‌తో వెళు న్న లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చిన్నపాటి లోయలోకి దూసుకెళ్లింది.

లారీ బ్రేకులు ఫెయిల్ కావడంతోనే ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. మూలమలుపు వద్ద డ్రైవర్ లారీని అదుపులోకి తీసుకురాలేకపోవడంతో వాహనం లోయలోకి వెళ్లి బోల్తా పడింది.

ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన డ్రైవర్‌ను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ప్రమాదంపై కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

# కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత డా॥నందిని సిధారెడ్డికి లండన్ టాక్ నాయకుల ఘన సన్మానం



హైదరాబాద్, ఆగష్టు 29: కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత, తెలంగాణ సాహిత్య అకాడమి తొలి ఛైర్మన్, ప్రముఖ కవి, రచయిత డా॥నందిని సిధారెడ్డి ని తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యునైటెడ్ కింగ్డమ్ (టాక్) నాయకులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని ఘనంగా సన్మానించారు

టాక్ సంస్థకు చీఫ్ అడ్వైజర్లుగా నందిని సిధారెడ్డి, కట్టా శేఖర్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. లండన్‌లో టాక్ సంస్థ ఆవిర్భావ కార్యక్రమానికి హాజరైనప్పటి నుంచి సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలను నిశితంగా గమనిస్తున్నామని నందిని సిధారెడ్డి తెలిపారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేయడంతో పాటు, వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ టాక్ సంస్థ తన లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు సాగుతున్న తీరు అభినందనీయమని ఆయన ప్రశంసించారు. ముఖ్యంగా టాక్ వ్యవస్థాపకుడు అనిల్ కూర్మాచలం, పూర్వ అధ్యక్షురాలు పవిత్ర రెడ్డి, ప్రస్తుత అధ్యక్షుడు రత్నాకర్ కడుదులతో పాటు కార్యవర్గ సభ్యుల కృషిని ప్రత్యేకంగా అభినందించారు.

సంస్థలను ఏర్పాటు చేయడం మాత్రమే గొప్ప విషయం కాదని, వాటిని స్థిరంగా కొనసాగిస్తూ దీర్ఘకాలం ప్రజలకు ఉపయోగపడేలా ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నాయకత్వానికి నిదర్శనమని నందిని సిధారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా నందిని సిధారెడ్డి రచించి కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారం పొందిన 'అనిమేష' కవితా సంపుటితో పాటు ఇతర పుస్తకాలను టాక్ సభ్యులకు బహూకరించారు.

తెలంగాణ ఎఫ్డీసీ మాజీ ఛైర్మన్, టాక్ వ్యవస్థాపకుడు అనిల్ కూర్మాచలం మాట్లాడుతూ, నందిని సిధారెడ్డి గారికి కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారం లభించడం యావత్ తెలంగాణకు గర్వకారణమన్నారు. టాక్ కమ్యూనిటీ అఫైర్స్ ఛైర్‌పర్సన్ గణేష్ కుప్పాల, అడ్వైజరీ బోర్డు సభ్యురాలు జాహ్నవి మాట్లాడుతూ నందిని సిధారెడ్డి గారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో నవ్య కుప్పాల, నాయకులు తిరుమందాస్ నరేష్ గౌడ్, వినయ్ కుమార్ గౌడ్ బత్తిని పాల్గొన్నారు.

# పరిశ్రమలే దేశ ప్రగతికి పట్టుగొమ్మలు

## (30 ఆగస్టు "జాతీయ చిన్న తరహా పరిశ్రమల దినోత్సవం" సందర్భంగా)

చిన్న వర్గాల, ముఖ్యంగా పేద వర్గాల ప్రజలకు గౌరవప్రద పని కల్పించి , నిరుద్యోగ సమస్యకు కొంత పరిష్కారం చూపి, దేశ ఆర్థికాభివృద్ధికి ఊతం ఇవ్వడానికి తిన్న తరహా పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వాలు చొరవ తీసుకోవడం కొనసాగుతున్నది. పేద యువతకు వరంగా మారిన చిన్నతరహా పరిశ్రమల్లో ముఖ్యమైనవిగా క్యాండిల్ తయారి, వ్యవసాయ సంబంధ ఉత్పత్తులు, వస్త్రాలు-రెడీ మేడ్ దుస్తువుల తయారీ, హస్తకళా ఉత్పత్తులు, బొమ్మల తయారి, మసాలా దినుసుల తయారీ, అగర్‌బత్తీల తయారీ, పేపర్ ప్లేట్స్, పచ్చళ్ల తయారీ, నగల తయారీ, లెదర్ ఉత్పత్తులు, సౌందర్య ఉత్పత్తుల తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్, గృహాల్లో వాడుకునే రసాయనాలు లాంటి ఉత్పత్తులు వస్తాయి.

### జాతీయ చిన్న తరహా పరిశ్రమల దినోత్సవం:

భారత కేంద్ర ప్రభుత్వ చిన్న తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ 20 ఆగస్టు 2000 రోజున చిన్న తరహా పరిశ్రమలను పెద్ద మొత్తంలో నెలకొల్పడానికి, ప్రణాళికలు ప్రవేశ పెట్టడం జరిగింది. ఈ నిర్ణయానికి గుర్తుగా ప్రతి ఏట 30 ఆగస్టు రోజున "జాతీయ చిన్న తరహా పరిశ్రమల దినోత్సవం (నేషనల్ స్మాల్-స్కేల్ ఇండస్ట్రీ డే)" పాటించడానికి నిర్ణయం తీసుకున్నారు. చిన్న తరహా పరిశ్రమల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం, అవసర నైపుణ్యాలను పెంపొందించడం, ఆర్థిక చేయూతను ఇవ్వడం, మహిళాశక్తిని బలోపేతం చేయడం, ఉద్యోగ ఉపాధులను కల్పించడం, దేశ ఆర్థిక ప్రగతికి బాటలు వేయడం లాంటి అంశాలను ప్రచారం చేయడానికి ఈ దినోత్సవ వేదికలు ఉపయోగపడతాయి.

### జాతీయ చిన్న తరహా పరిశ్రమల దినోత్సవ ఉద్దేశ్యం:

జాతీయ చిన్న తరహా పరిశ్రమల దినోత్సవాన్ని 30 ఆగస్టు 2001 నుంచి ప్రతి ఏటా నిర్వహించడం జరుగుతోంది. దేశ సమగ్రాభివృద్ధికి చిన్న తరహా పరిశ్రమలు ఎంతగానో దోహదపడుతున్నాయి. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో చిన్న పరిశ్రమలను ఏర్పాటు చేస్తూ, కుటుంబాలకు శ్రేయస్సు కల్పించడంతో పాటు సమ్మిళిత అభివృద్ధి దిశగా అడుగులు వేయడం జరుగుతోంది.

పేద ప్రజలను లేదా యువతను ఎంపిక చేసుకొని వారితో ఔత్సాహిక వేత్తలుగా ప్రోత్సహించడం, ఉద్యోగాల కల్పన, ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇవ్వడం, సమ్మిళిత అభివృద్ధికి దోహదపడడం,

ఔత్సాహిక వ్యాపారవేత్తలను శక్తివంతం చేయడం, స్థానిక హస్తకళలను ప్రోత్సహించడం, భారత సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడడం లాంటి లక్ష్యాలతో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారు

. చిన్న తరహా పరిశ్రమలను ఏర్పాటు చేసి ఖ్యాతి గడించిన వ్యాపారవేత్తలను గుర్తించడం, లోపాలను లేదా అవరోధాలను గుర్తించడం, చిన్న పరిశ్రమల శక్తిని వివరించడం లాంటి అంశాలను కూడా ఈ వేదికను ఉపయోగించుకుంటారు.

జాతీయ చిన్న తరహా పరిశ్రమల దినం వేదికగా నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించి, ఆర్థిక సహాయం అందించి, అవసర నైపుణ్యాలను నేర్పించి, పట్టణ గ్రామీణ ప్రగతిని పరుగులు పెట్టించడం విధిగా జరగాలి. చిన్న పరిశ్రమలతో పెద్ద మార్పులను తీసుకురావాలి. ఊరూ, వాడ, పల్లె, పట్నాలు చిన్న తరహా పరిశ్రమలతో కళకళలాడాలని కోరుకుందాం.



-మధుపాలీ
9949700037

# ప్రణాళికాబద్ధమైన బోధనతో ఉత్తమ ఫలితాలు సాధించాలి

**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**
**విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను చేరుకునేలా తీర్చిదిద్దాలి.**
**విద్యార్థినులకు నిర్ణీత ఆహార పట్టిక ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి.**
**సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్.**



ములుగు ఆగష్టు 29:(నేటినిజం ప్రతినిధి): ప్రణాళికాబద్ధమైన బోధనతో విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, ఉన్నత లక్ష్యాలను చేరుకునేలా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సూచించారు.

శనివారం ములుగు జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా పాఠశాల, కళాశాలలోని నిఘా కెమెరాల పనితీరు, విద్యార్థినులు, ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరు శాతాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్న అనంతరం తరగతి గదులను సందర్శించి బోధన తీరును పరిశీలించారు. జూనియర్ కళాశాల విద్యార్థినులకు నిర్వహిస్తున్న యూనిట్ పరీక్షల తీరును పరిశీలించి, పరీక్షల నిర్వహణపై సంబంధిత ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

విద్యార్థినులకు నిర్ణీత ఆహార పట్టిక ప్రకారం నాణ్యమైన, పౌష్టికమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. శనివారం ఆహార పట్టిక ప్రకారం అందించాల్సిన భోజన పదార్థాల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. భోజనం తయారీలో నాణ్యత, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

విద్యార్థినులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, విద్యాభ్యాసం, ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ స్వాతి, రికార్డు అసిస్టెంట్ రాజు, సంబంధిత అధికారులు, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

# వీడనున్న రాజకీయ గ్రహణం..

## ముచ్చటగా మూడోసారి ఐలాండ్స్ నిర్మాణం

ఆదిలాబాద్, ఆగష్టు 29:మంచిర్యాల పట్టణంలోని ప్రధాన కూడళ్లలో నిర్మించిన ఐలాండ్స్ వివాదాలకు, ప్రమాదాలకు కారణమవుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకసారి నిర్మించడం, ఆ తర్వాత కూల్చివేయడం, మళ్లీ నిర్మించడం.. ఇలా రెండుసార్లు జరిగిన పరిణామాల నేపథ్యంలో వెంకటేశ్వర థియేటర్ చౌరస్తా, లక్ష్మీ థియేటర్ చౌరస్తాల్లో ముచ్చటగా మూడోసారి ఐలాండ్స్ నిర్మాణ పనులు ప్రారంభం కావడం చర్చనీయాంశంగా మారింది.

మంచిర్యాల జిల్లా కేంద్రంగా ఏర్పడిన అనంతరం పెరుగుతున్న జనాభా, పట్టణంలో ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని పురపాలక సంఘం ఆధ్వర్యంలో 2023 అక్టోబర్‌లో నాలుగు ప్రధాన కూడళ్లలో ఐలాండ్స్ నిర్మించారు. అంబేద్కర్ చౌక్, వెంకటేశ్వర థియేటర్ చౌరస్తా, బెల్లంపల్లి చౌరస్తా, లక్ష్మీ థియేటర్ చౌరస్తాల్లో వీటిని ఏర్పాటు చేశారు. అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం మారడం, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో కొత్తగా ఏర్పాటైన పాలకవర్గం ఆధ్వర్యంలో వాటిని ప్రారంభించారు.

అయితే ఐలాండ్స్ పరిమాణం, రహదారి వెడల్పు మధ్య సరైన సమన్వయం లేకపోవడంతో వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు ఎదురయ్యాయని స్థానికులు పేర్కొన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, పాదచారులకు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని, పలువురు ప్రాణాలు కోల్పోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నాలుగు కూడళ్లలోని ఐలాండ్స్‌ను తొలగించి తిరిగి నిర్మించారు.

అయినప్పటికీ వెంకటేశ్వర థియేటర్, లక్ష్మీ థియేటర్ చౌరస్తాల్లోని ఐలాండ్స్‌ను మరోసారి తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ కూడా సక్రమంగా పనిచేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఒకే కూడలిలో ఇద్దరు ట్రాఫిక్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నప్పటికీ ప్రమాదాలు తగ్గడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఐలాండ్స్ నిర్మాణం, తొలగింపు, పునర్నిర్మాణం పేరుతో ప్రజాధనం ఖర్చవుతోందని పట్టణ ప్రజల్లో విమర్శలు వినిపిస్తున్నాయి. రాజకీయ మార్పులకు అనుగుణంగా నిర్మాణాలను చేపట్టడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని కొందరు ఆరోపిస్తున్నారు. అయితే సంబంధిత అధికారులు మాత్రం ట్రాఫిక్ అవసరాలు, రహదారి పరిస్థితులకు అనుగుణంగానే చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్నారు.

ఈ నేపథ్యంలో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 29న వెంకటేశ్వర థియేటర్, లక్ష్మీ థియేటర్ చౌరస్తాల్లో మూడోసారి ఐలాండ్స్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. గతంలో రెండుసార్లు నిర్మించి, తొలగించిన ఐలాండ్స్ స్థానంలో ఇప్పుడు చేపడుతున్న పనులు పూర్తయితే ట్రాఫిక్ సమస్యలు కొంతవరకు తగ్గే అవకాశం ఉందని ప్రజలు భావిస్తున్నారు.

మూడోసారి చేపడుతున్న నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి, ట్రాఫిక్ సిగ్నళ్లను సమర్థంగా నిర్వహించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## ఉజ్బెకిస్తాన్, కిర్గిజ్ దేశాల్లో ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 1 వరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన

న్యూఢిల్లీ, ఆగష్టు 29: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2026 ఆగస్టు 29, 30 తేదీల్లో ద్వైపాక్షిక పర్యటనలో భాగంగా ఉజ్బెకిస్థాన్‌కు, ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు కిర్గిజ్ దేశ పర్యటనకు వెళ్లనున్నారు.

ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు శ్రీ షవ్కత్ మిర్జియోయెవ్ ఆహ్వానం మేరకు ప్రధాని శ్రీ మోదీ ఆగస్టు 29, 30 తేదీల్లో తాష్కెంట్‌లో అధికారికంగా పర్యటించనున్నారు. ఇది ఉజ్బెకిస్థాన్‌లో ప్రధానికి నాలుగో పర్యటన. పర్యటనలో భాగంగా అధ్యక్షుడు మిర్జియోయెవ్‌తో ప్రతినిధి స్థాయి చర్చలు జరిపి ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయనున్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, డిజిటల్ అనుసంధానం, ఇంధనం, విద్య, ప్రజల మధ్య సంబంధాలు తదితర రంగాల్లో సహకారాన్ని ఇరువురు నేతలు సమీక్షించనున్నారు. అలాగే 'వికసిత్ భారత్ 2047', 'ఉజ్బెకిస్థాన్-2030' అభివృద్ధి లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లే అంశాలపై అభిప్రాయాలను పంచుకోనున్నారు. తాష్కెంట్‌లోని శాస్త్రి స్మారకాన్ని, తాష్కెంట్ స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ ఓరియెంటల్ స్టడీస్‌లోని మహాత్మా గాంధీ కేంద్రాన్ని కూడా ప్రధాని సందర్శించే అవకాశం ఉంది.

తాష్కెంట్ నుంచి ఉజ్బెకిస్థాన్ పర్యటన అనంతరం కిర్గిజ్ గణతంత్ర దేశ అధ్యక్షుడు శ్రీ సదీర్ జపరోవ్ ఆహ్వానం మేరకు ప్రధానమంత్రి ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో బిష్కెక్‌లో జరిగే 26వ ఎస్‌సీఓ శిఖరాగ్ర సదస్సులో పాల్గొంటారు. 2017 నుంచి ఎస్‌సీఓలో పూర్తిస్థాయి సభ్యదేశంగా ఉన్న భారత్‌కు ఈ సదస్సు ప్రత్యేక ప్రాధాన్యత కలిగి ఉంది. షాంఘై సహకార సంస్థ ఏర్పాటై 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సదస్సులో ప్రధానమంత్రి భద్రత, అనుసంధానం, అవకాశాలు అనే అంశాలపై భారత్ ప్రాధాన్యతలను వివరించనున్నారు. సదస్సు సందర్భంగా ఎస్‌సీఓ దేశాల నేతలతో ప్రధాని ద్వైపాక్షిక సమావేశాలు కూడా నిర్వహించనున్నారు. అలాగే మధ్య ఆసియా గొప్ప సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిర్వహించే 6వ వరల్డ్ నోమాడ్ గేమ్స్ ప్రారంభోత్సవంలో కూడా ప్రధాని పాల్గొంటారు.

# ఎవాన్ 3.3, ఫ్లెక్సస్‌లతో కూడిన స్వదేశీ ఏఐ సాంకేతిక వేదిక

## 'జ్ఞాని అర్థ'ను ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి శ్రీ సి.పి. రాధాకృష్ణన్

న్యూఢిల్లీ, ఆగష్టు 29:జ్ఞాని ఏఐ అభివృద్ధి చేసిన ఎవాన్ 3.3, ఫ్లెక్సస్ లతో కూడిన స్వదేశీ ఏఐ సాంకేతిక వేదిక 'జ్ఞాని అర్థ'ను ఉపరాష్ట్రపతి శ్రీ సి.పి. రాధాకృష్ణన్ ఈ రోజు న్యూఢిల్లీలోని ఉపరాష్ట్రపతి భవన్‌లో ప్రారంభించారు. ఎవాన్ 3.3 ఒక లార్జ్ లాంగ్వేజ్ మోడల్ కాగా, ఫ్లెక్సస్ ఏఐ సాంకేతికతను వాస్తవ ప్రపంచ పనులతో, సంస్థలతో అనుసంధానించే వేదిక.

'జ్ఞాని అర్థ' ఆవిష్కరణను స్వాగతిస్తూ, ఎవాన్ 3.3, ఫ్లెక్సస్‌ల సమ్మేళనం భారత సాంకేతిక వ్యవస్థలో పెరుగుతున్న సామర్థ్యానికి ప్రతిబింబమని, భారతీయ ఇంజినీర్లు అత్యాధునిక సాంకేతికతలను వినియోగించడమే కాకుండా, వాటిని స్వయంగా అభివృద్ధి చేయగలరని నిరూపిస్తోందని ఉపరాష్ట్రపతి అన్నారు.

టైప్‌రైటర్ల, పరిమిత స్థాయిలో వ్యక్తిగత కంప్యూటర్ల వినియోగం ఉన్న కాలం నుంచి నేటి కృత్రిమ మేధ, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ యుగం వరకు సాంకేతికతలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని శ్రీ రాధాకృష్ణన్ అన్నారు. కంప్యూటర్ల వల్ల ఉద్యోగాలు పోతాయన్న ఆందోళనలు గతంలో వ్యక్తమైనప్పటికీ, అందుకు భిన్నంగా ఐటీ రంగం భారత్‌లోనూ, విదేశాల్లోనూ అనేక ఉపాధి అవకాశాలను సృష్టించిందని ఆయన గుర్తుచేశారు. అదే విధంగా ఏఐ కూడా కొత్త ఉపాధి, అభివృద్ధి అవకాశాలకు మార్గం సుగమం చేస్తుందని, తద్వారా భారత ఆర్థిక ప్రగతిని తదుపరి దశకు తీసుకెళ్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

కృత్రిమ మేధ రంగంలో భారత్ సాధిస్తున్న వేగవంతమైన పురోగతిని ఉపరాష్ట్రపతి ప్రస్తావిస్తూ, ఇండియా ఏఐ మిషన్, ఏఐ కోసం ఏర్పాటు చేసిన సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ వంటి కార్యక్రమాలు దేశ మార్పు ప్రక్రియను వేగవంతం చేస్తున్నాయని పేర్కొన్నారు. దేశంలో సాంకేతిక మార్పుకు వెన్నుదన్నుగా నిలుస్తున్న వేగానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వమే ప్రధాన కారణమని ఆయన అన్నారు. ఆయన రాజకీయ సంకల్పం, 'ఇండియా ఫస్ట్' విధానం పట్ల నిబద్ధత వల్లనే అభివృద్ధి చెందు తున్న సాంకేతికతల్లో భారత సామర్థ్యాలు మరింత బలోపేత మవుతున్నాయని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు.

పార్లమెంట్‌లో ఏఐ వినియోగాన్ని ప్రస్తావిస్తూ, డిజిటల్ సంసద్ పోర్టల్ ద్వారా పార్లమెంటరీ చర్చలు, పత్రాలను పలు భారతీయ భాషల్లో అందుబాటులోకి తీసుకురావడం సాధ్యమవుతోందని ఆయన తెలిపారు. ఇటీవల ముగిసిన పార్లమెంట్ సమావేశాల్లో ఎనిమిది భాషల్లో ఏకకాలంలో ఏఐ ఆధారిత అనువాద సదుపాయాన్ని ప్రవేశపెట్టామని, త్వరలోనే దీనిని రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో పేర్కొన్న అన్ని భాషలకు విస్తరించనున్నట్లు ఆయన వెల్లడించారు.

సాంకేతిక స్వావలంబన ఆవశ్యకతను ప్రస్తావిస్తూ, భారత్ కేవలం సాంకేతికతను వినియోగించే దేశంగా మాత్రమే మిగిలిపోకూడదని అన్నారు.

"మనం ఎల్లప్పుడూ వినియోగదారులుగా ఉండకూడదు. ఇతరులు వినియోగించేలా వస్తువులను మనమే సృష్టించాలి" అని పేర్కొంటూ, దేశీయ సాంకేతిక సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సిన ప్రాధాన్యతను ఆయన వివరించారు.

సాంకేతిక, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని బలోపేతం చేసేందుకు స్వదేశీ ఏఐ సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవడం ఎంతో కీలకమని ఉపరాష్ట్రపతి ఉద్ఘాటించారు. సెమీకండక్టర్ తయారీని ప్రస్తావిస్తూ, భారత్ మరింత ముందుగానే చిప్‌ల తయారీని ప్రారంభించి ఉంటే, ఈరోజు ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా ఎదిగి ఉండేదని ఆయన అన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో సెమీకండక్టర్ రంగం మళ్లీ ఊపందుకుందని ఆయన పేర్కొన్నారు.

వికసిత్ భారత్ - 2047 దిశగా భారత్ సాగించే ప్రస్థానంలో సాంకేతిక సామర్థ్యం ఒక కీలకమైన స్తంభంగా నిలుస్తుందని ఉపరాష్ట్రపతి అన్నారు. సాంకేతిక స్వావలంబన, ఆవిష్కరణలు, ప్రపంచ నాయకత్వం వైపు భారత్ సాగుతున్న విస్తృత జాతీయ ప్రస్థానంలో 'జ్ఞాని అర్థ' ఒక ముఖ్యమైన భాగమని ఆయన అభివర్ణించారు.

'జ్ఞాని అర్థ' ఆవిష్కరణ సందర్భంగా జ్ఞాని ఏఐ సీఈఓ శ్రీ గణేశ్ గోపాలన్, సహ వ్యవస్థాపకుడు, సీటీఓ శ్రీ అనంత్ నాగరాజ్‌లకు ఉపరాష్ట్రపతి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం మరింత బలమైన, స్వావలంబనతో కూడిన, సాంకేతికంగా సాధికారత కలిగిన భారత్ నిర్మాణానికి దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# దేశవ్యాప్తంగా పోగొట్టుకున్న, చోరీ అయిన మొబైల్ ఫోన్‌ల రికవరీలో భారీ విజయం

న్యూఢిల్లీ, ఆగష్టు 29:పోగొట్టుకున్న, చోరీ అయిన మొబైల్ హ్యాండ్‌సెట్‌లను తిరిగి స్వాధీనం చేసుకోవడంలో టెలికమ్యూనికేషన్ల శాఖ (డీవోటీ) ప్రతిష్ఠాత్మక పౌర కేంద్రిత కార్యక్రమం 'సంచార్ సాథీ' ఇటీవల కీలక విజయం సాధించింది. ప్రారంభమైనప్పటి నుంచి తొలిసారిగా... ఒక నెలలోనే 75,000 కంటే ఎక్కువ మొబైల్ హ్యాండ్‌సెట్‌లను తిరిగి స్వాధీనం చేసుకోవడంలో సంచార్ సాథీ విజయం సాధించింది. ఈ కార్యక్రమం పట్ల ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి ఈ విజయం నిదర్శనం. సాంకేతికత ఆధారిత పాలన ద్వారా పౌర సాధికారతనూ ఇది ప్రదర్శిస్తుంది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో డీవోటీ, టెలికాం సర్వీస్ ప్రొవైడర్లు (టీఎస్‌పీలు), పోలీసు విభాగాల మధ్య బలమైన సమన్వయాన్నీ ఇది ప్రతిబింబిస్తుంది.


రికవరీలను పెంచడంపై దృష్టి సారిస్తూ, ఈ వ్యవస్థలో నిరంతర మెరుగుదల కోసం సంబంధిత వర్గాల అభిప్రాయాలను డీవోటీ సేకరిస్తోంది. ఈ లక్ష్యాన్ని సాధించడానికి చేపట్టిన ప్రధాన చర్యలు కింది విధంగా ఉన్నాయి:

ట్రేసెబిలిటీ నివేదికల ద్వారా పౌరులకు సంబంధిత పోలీస్ స్టేషన్ పేరును ఎస్ఎంఎస్, ఈమెయిల్, పోర్టల్, యాప్ ద్వారా తెలియజేయడం.రికవరీలను పెంచడం కోసం... పోగొట్టుకున్న/చోరీ అయిన మొబైల్ హ్యాండ్‌సెట్‌లలో కొత్తగా చేర్చిన సిమ్ వివరాలు, ప్రత్యామ్నాయ మొబైల్ నంబరుతో సహా పోలీసు అధికారులకు అందించడం.ఏదైనా అనుమానిత మాల్వేర్ నుంచి రక్షణ కోసం, తిరిగి పొందిన మొబైల్ హ్యాండ్‌సెట్‌ను ఫ్యాక్టరీ రీసెట్ చేయమని పౌరులకు ఎస్ఎంఎస్ ద్వారా సూచించడం.

పటిష్ఠ పునాది, వ్యవస్థలో నిరంతర మెరుగుదల ఫలితంగా ఈ విజయం లభించింది. పరికరాలను సమర్థంగా గుర్తించి, వాటి అసలైన యజమానులకు తిరిగి అప్పగించేలా చూసేందుకు డీవోటీ డిజిటల్ ఇంటెలిజెన్స్ యూనిట్, క్షేత్రస్థాయి విభాగాలు... రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఎల్ఎస్ఏలు, పోలీసు సిబ్బంది సన్నిహిత సమన్వయంతో పనిచేస్తున్నారు. డీవోటీ, రాష్ట్ర-కేంద్రపాలిత ప్రాంత పోలీసుల అంకితభావంతో కూడిన కృషి ఫలితంగా... ఏప్రిల్ 2025 నుంచి జూలై 2026 వరకు నెలవారీ హ్యాండ్‌సెట్ రికవరీలో 201 శాతం గణనీయ పెరుగుదల నమోదైంది. వివరాలు కింద చూడవచ్చు:

పటిష్ఠమైన, స్వదేశీ ప్లాట్‌ఫారమ్... సమీకృత ఆటోమేటెడ్ వర్క్‌ఫ్లోలు... రియల్-టైమ్ డివైస్ ట్రేసెబిలిటీల ఫలితంగా ఈ గణనీయ గుర్తింపు లభించింది. పోగొట్టుకున్న, చోరీ అయిన హ్యాండ్‌సెట్‌ను గురించి పౌరులు వెబ్ పోర్టల్ (లిలిలి.బజీనిఇఖ్రజీతీబజీజీబిష్ఠ్రతి.ఐనీల.తిని) లేదా మొబైల్ యాప్ ద్వారా సంచార్ సాథీలో సులభ దశల్లో రిపోర్ట్ చేయవచ్చు. రిపోర్ట్ చేసిన వెంటనే, ఆ పరికరాల దుర్వినియోగాన్ని నివారించడానికి ఆ మొబైల్ హ్యాండ్‌సెట్‌ను భారతీయ టెలికాం నెట్‌వర్క్‌లో బ్లాక్ చేస్తారు. పోగొట్టుకున్న, చోరీ అయిన హ్యాండ్‌సెట్‌ను ఉపయోగించడానికి చేసే ఏ ప్రయత్నాన్నైనా నెట్‌వర్క్ గుర్తించి, దానిని తిరిగి స్వాధీనం చేసుకుని అసలు యజమానికి అప్పగించేందుకు వీలుగా పౌరులకు, పోలీస్ స్టేషన్‌కు హెచ్చరికను పంపిస్తుంది.

ప్రభుత్వ డిజిటల్ ఇండియా దార్శనికతకు అనుగుణంగా... సంచార్ సాథీ ద్వారా పౌరులకు సాధికారత కల్పించడానికి, డిజిటల్ ఆస్తులను పరిరక్షించడానికి డీవోటీ కట్టుబడి ఉంది.




# పోలీసు సంఘం ప్రతినిధులకు ఘన సన్మానం

ఆదిలాబాద్, ఆగష్టు 29: పోలీసు సంఘం ప్రతినిధులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన స్థానిక ఎస్సై గుర్రం ఉదయ్ కిరణ్, హెడ్ కానిస్టేబుల్ జె.లింగన్నలను స్థానిక పోలీసులు ఘనంగా సన్మానించారు. శనివారం మధ్యాహ్నం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగిన పోలీసు సంఘం ఎన్నికల్లో మంచిర్యాల ఉపవిభాగం ప్రతినిధిగా ఎస్సై గుర్రం ఉదయ్ కిరణ్, లక్షెట్టిపేట సర్కిల్ ప్రతినిధిగా హెడ్ కానిస్టేబుల్ జె.లింగన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సహచర పోలీసులు వారిని అభినందిస్తూ, పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రతినిధులుగా సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై ఉమేష్ కుమార్, హెడ్ కానిస్టేబుళ్లు గౌస్, దేవన్న, బి.తుకారాం, శ్రీనివాసరావు, దత్తు, కానిస్టేబుళ్లు వెంకటేష్, చంద్రమౌళి, సంతోష్, సురేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా పోగొట్టుకున్న, చోరీ అయిన మొబైల్ ఫోన్‌ల రికవరీలో భారీ విజయం

న్యూఢిల్లీ, ఆగస్టు 29:పోగొట్టుకున్న, చోరీ అయిన మొబైల్ హ్యాండ్‌సెట్‌లను తిరిగి స్వాధీనం చేసుకోవడంలో టెలికమ్యూనికేషన్ల శాఖ (డీవోటీ) ప్రతిష్ఠాత్మక పౌర కేంద్రిత కార్యక్రమం 'సంచార్ సాథీ' ఇటీవల కీలక విజయం సాధించింది. ప్రారంభమైనప్పటి నుంచి తొలిసారిగా... ఒక నెలలోనే 75,000 కంటే ఎక్కువ మొబైల్ హ్యాండ్‌సెట్‌లను తిరిగి స్వాధీనం చేసుకోవడంలో సంచార్ సాథీ విజయం సాధించింది. ఈ కార్యక్రమం పట్ల ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి ఈ విజయం నిదర్శనం. సాంకేతికత ఆధారిత పాలన ద్వారా పౌర సాధికారతనూ ఇది ప్రదర్శిస్తుంది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతా డీవోటీ, టెలికాం సర్వీస్ ప్రొవైడర్లు (టీఎస్‌పీలు), పోలీసు విభాగాల మధ్య బలమైన స ఇది ప్రతిబింబిస్తుంది.

రికవరీలను పెంచడంపై దృష్టి సారిస్తూ, ఈ వ్యవస్థలో నిరంతర మెరుగుదల కోసం సంబంధిత వర్గాల అభిప్రాయాను డీవోటీ సేకరిస్తోంది. ఈ లక్ష్యాన్ని సాధించడానికి చేపట్టిన ప్రధాన చర్యలు కింది విధంగా ఉన్నాయి:

ట్రేసెబిలిటీ నివేదికల ద్వారా పౌరులకు సంబంధిత పోలీస్ స్టేషన్ పేరును ఎస్ఎంఎస్, ఈమెయిల్, పోర్టల్, యాప్ ద్వారా తెలియజేయడం.

రికవరీలను పెంచడం కోసం... పోగొట్టుకున్న/చోరీ అయిన మొబైల్ హ్యాండ్‌సెట్‌లలో కొత్తగా చేర్చిన సిమ్ వివరాలు, ప్రత్యామ్నాయ మొబైల్ నంబరుతో సహా పోలీసు అధికారులకు అందించడం.ఏదైనా అనుమానిత మాల్వేర్ నుంచి రక్షణ కోసం, తిరిగి పొందిన మొబైల్ హ్యాండ్‌సెట్‌ను ఫ్యాక్టరీ రీసెట్ చేయమని పౌరులకు ఎస్ఎంఎస్ ద్వారా సూచించడం.

పటిష్ఠ పునాది, వ్యవస్థలో నిరంతర మెరుగుదల ఫలితంగా ఈ విజయం లభించింది. పరికరాలను సమర్థంగా గుర్తించి, వాటి అసలైన యజమానులకు తిరిగి అప్పగించేలా చూసేందుకు డీవోటీ డిజిటల్ ఇంటెలిజెన్స్ యూనిట్, క్షేత్రస్థాయి విభాగాలు... రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఎల్ఎస్ఏలు, పోలీసు సిబ్బంది సన్నిహిత సమన్వయంతో పనిచేస్తున్నారు. డీవోటీ, రాష్ట్ర-కేంద్రపాలిత ప్రాంత పోలీసుల అంకితభావంతో కూడిన కృషి ఫలితంగా... ఏప్రిల్ 2025 నుంచి జూలై 2026 వరకు నెలవారీ హ్యాండ్‌సెట్ రికవరీలో 201 శాతం గణనీయ పెరుగుదల నమోదైంది. వివరాలు కింద చూడవచ్చు:

పటిష్ఠమైన, స్వదేశీ ప్లాట్‌ఫారమ్... సమీకృత ఆటోమేటెడ్ వర్క్‌ఫ్లోలు... రియల్-టైమ్ డివైస్ ట్రేసెబిలిటీల ఫలితంగా ఈ గణనీయ గుర్తింపు లభించింది. పోగొట్టుకున్న, చోరీ అయిన హ్యాండ్‌సెట్‌ను గురించి పౌరులు వెబ్ పోర్టల్ లేదా మొబైల్ యాప్ ద్వారా సంచార్ సాథీలో సులభ దశల్లో రిపోర్ట్ చేయవచ్చు. రిపోర్ట్ చేసిన వెంటనే, ఆ పరికరాల దుర్వినియోగాన్ని నివారించడానికి ఆ మొబైల్ హ్యాండ్‌సెట్‌ను భారతీయ టెలికాం నెట్‌వర్క్‌లో బ్లాక్ చేస్తారు. పోగొట్టుకున్న, చోరీ అయిన హ్యాండ్‌సెట్‌ను ఉపయోగించడానికి చేసే ఏ ప్రయత్నాన్నైనా నెట్‌వర్క్ గుర్తించి, దానిని తిరిగి స్వాధీనం చేసుకుని అసలు యజమానికి అప్పగించేందుకు వీలుగా పౌరులకు, పోలీస్ స్టేషన్‌కు హెచ్చరికను పంపిస్తుంది.ప్రభుత్వ డిజిటల్ ఇండియా దార్శనికతకు అనుగుణంగా... సంచార్ సాథీ ద్వారా పౌరులకు సాధికారత కల్పించడానికి, డిజిటల్ ఆస్తులను పరిరక్షించడానికి డీవోటీ కట్టుబడి ఉంది. పోగొట్టుకున్న లేదా చోరీ అయిన మొబైల్ ఫోన్‌ల గురించి కింది విధంగా అందుబాటులో ఉన్న సంచార్ సాథీ పోర్టల్ లేదా మొబైల్ యాప్ ద్వారా తెలియజేయాలని పౌరులను ప్రోత్సహిస్తున్నాం:

# ఢిల్లీలో భారత్ – కువైట్ సంయుక్త రక్షణ కమిటీ తొలి సమావేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 29:భారత్ – కువైట్ సంయుక్త రక్షణ కమిటీ (జేడీసీ) తొలి సమావేశం ఈ రోజు ఢిల్లీలో జరిగింది. శిక్షణ, సైనిక విన్యాసాలు, సైనిక వైద్యం, సిబ్బంది స్థాయి చర్చలు, రక్షణ పరిశ్రమ, పరిశోధన – అభివృద్ధి తదితర విస్తృత రంగాల్లో ద్వైపాక్షిక రక్షణ సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి.

భారత్, కువైట్ మధ్య రక్షణ సహకారంపై కుదిరిన అవగాహన ఒప్పందంలో పేర్కొన్న లక్ష్యాలను అమలు దిశగా ముందుకు తీసుకెళ్లడంలో జేడీసీ తొలి సమావేశం కీలక ముందడుగుగా నిలిచింది. 2024 డిసెంబర్‌లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ కువైట్ పర్యటన సందర్భంగా ఈ రక్షణ సహకార అవగాహన ఒప్పందం కుదిరింది.

ఈ సమావేశానికి భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ అమితాబ్ ప్రసాద్, కువైట్ నుంచి ఐదుగురు సభ్యుల ప్రతినిధి బృందానికి చెందిన బ్రిగేడియర్ జనరల్ రాయెద్ అల్‌సక్రాన్ సంయుక్తంగా అధ్యక్షత వహించారు. భారత ప్రతినిధి బృందంలో త్రివిధ దళాలు, రక్షణ ఉత్పత్తుల విభాగం, రక్షణ పరిశోధన – అభివృద్ధి సంస్థ (డీఆర్డీఓ), సాయుధ దళాల వైద్య సేవలు, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

జేడీసీ సమావేశానికి ముందు, బ్రిగేడియర్ జనరల్ రాయెద్ అల్‌సక్రాన్ న్యూఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకాన్ని సందర్శించి, అమర వీరులకు నివాళులర్పించారు. కువైట్ ప్రతినిధి బృందం పర్యటన తొలిరోజున న్యూఢిల్లీలోని డీపీఎస్‌యూ భవన్‌ను సందర్శించింది. భారత రక్షణ పరిశ్రమ ప్రతినిధులతో పరస్పర సహకారానికి అవకాశం ఉన్న రంగాలపై ఈ సందర్భంగా చర్చలు జరిగాయి. కువైట్ ప్రతినిధి బృందంతో రెండో రోజు కూడా రక్షణ పరిశ్రమ ప్రతినిధులు సమావేశం నిర్వహించనున్నారు.

భారత్, కువైట్ దేశాలు చారిత్రక సంబంధాలపై ఆధారపడిన సాంప్రదాయక స్నేహపూర్వక, సుహృద్భావ సంబంధాలను కొనసాగిస్తున్నాయి. ఈ సంబంధాలు కాలపరీక్షకు తట్టుకుని నిలిచాయి. ఇరు దేశాల మధ్య 1962లో దౌత్య సంబంధాలు ఏర్పడ్డాయి. 2024 డిసెంబర్‌లో భారత ప్రధానమంత్రి కువైట్ పర్యటన సందర్భంగా ఇరు దేశాల సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి పెంచారు. భౌగోళిక సారూప్యం, చారిత్రక వాణిజ్య సంబంధాలు, సాంస్కృతిక సారూప్యతలు, కువైట్‌లో పెద్ద సంఖ్యలో భారతీయులు ఉండటం వంటి అంశాలు ఇరు దేశాల మధ్య చిరకాలంగా కొనసాగుతున్న బహుముఖ సంబంధాలను సుస్థిరం చేస్తూ, మరింత బలోపేతం చేస్తున్నాయి.

# లబ్ధిదారులకు షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ..



కరీంనగర్, ఆగస్టు 29: పేదింటి ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలుస్తూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న షాదీ ముబారక్ పథకం వరంలాంటిదని బాబానగర్ గ్రామ సర్పంచ్ శ్రీరామ్ సుమలత (అరవింద్) అన్నారు. శనివారం బాబానగర్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద షాదీ ముబారక్ పథకం కింద మంజూరైన చెక్కులను సర్పంచ్ శ్రీరామ్ సుమలత (అరవింద్) లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పేద కుటుంబాలకు చెందిన ఆడబిడ్డల వివాహాల సమయంలో ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రభుత్వం అందిస్తున్న సాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. లబ్ధిదారులు మాట్లాడుతూ తమ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, బాల్కొండ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డికి, మాజీ రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డికి, మైనింగ్ శాఖ చైర్మన్ ఈరవత్రి అనిల్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమ్య, ఉప సర్పంచ్ మంద ఇమ్మాన్యుల్, వార్డు సభ్యులు, లబ్ధిదారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పీజీ పరీక్ష నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు..



కరీంనగర్, ఆగస్టు 29: జిల్లాలో ఆదివారం నిర్వహించనున్న నీట్-పీజీ 2026 పరీక్షను ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శనివారం డీసీపీ రామ్‌రెడ్డితో కలిసి పెద్దపల్లి మండలం పెద్దకల్వలలోని మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల, పెద్దపల్లి బందారికుంట సమీపంలోని ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల, రామగిరి మండలం సెంటినరీ కాలనీలోని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షా ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీట్-పీజీ పరీక్ష ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులను ఉదయం 7:30 గంటల నుంచి 8:45 గంటల వరకు మాత్రమే పరీక్షా హాల్లోకి అనుమతిస్తామని చెప్పారు.

అభ్యర్థులు తప్పనిసరిగా ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డుతోపాటు ఒరిజినల్ పర్మినెంట్, ప్రొవిజనల్ ఎంబీబీఎస్ అర్హత ధ్రువీకరణ పత్రం, దాని స్వీయ ధ్రువీకరించిన జిరాక్స్ కాపీని వెంట తెచ్చుకోవాలని సూచించారు. ప్రవేశపత్రాన్ని నిర్దేశిత విధంగా ఒకే ఏ4 పేపర్‌పై రంగుల్లో ముందు, వెనుక ముద్రించుకోవాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని టీజీఎస్ ఎన్‌పీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో ఆరోగ్య సహాయకులను ఏర్పాటు చేసి అవసరమైన వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారికి సూచించారు.

పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చూడాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో సీసీటీవీ నిఘా, మొబైల్ జామర్లు ఏర్పాటు చేయడంతోపాటు ప్రతి అభ్యర్థికి హెచ్‌హెచ్ఎండీ తనిఖీ, మాన్యువల్ బాడీ ఫ్రిస్కింగ్ నిర్వహించాలని తెలిపారు. నమోదు సమయంలో ఆధార్ ధ్రువీకరణ, ఫొటో, ఎడమ చేతి బొటనవేలు ముద్ర, ముఖ గుర్తింపు, బార్‌కోడ్ స్కానింగ్ వంటి నిర్దేశిత ప్రక్రియలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, గడియారాలు, ఆభరణాలు, షూస్‌ను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరాదని స్పష్టం చేశారు.

పరీక్ష పర్యవేక్షణ కోసం జిల్లాలో రెండు ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రశ్నపత్రం ఐదు సమయ పరిమితి విభాగాలుగా ఉంటుందని, ఒక్కో విభాగానికి 42 నిమిషాల సమయం ఉంటుందని చెప్పారు. అభ్యర్థులకు నీళ్ల సీసా అందిస్తామని, రఫ్ షీట్, పెన్ను అందించబడవని తెలిపారు. పరీక్ష ప్రారంభానికి ముందు నమోదు ప్రక్రియ పూర్తైన అనంతరం అభ్యర్థులకు బయో బ్రేక్‌లకు అనుమతి ఉండదని పేర్కొన్నారు.

సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో పని చేస్తూ పరీక్షను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను సిద్ధంగా ఉంచాలని, పరీక్ష నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, తహసిల్దార్ రాజయ్య, సుల్తానాబాద్ తహసిల్దార్ బషీరుద్దీన్, రామగిరి తహసిల్దార్ సుమన్, పరీక్షా కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# ఈశాన్య ప్రాంత సరిహద్దులో రెండు చోట్ల 76 కిలోల మెథాంఫేటమిన్ ట్యాబ్లెట్లను స్వాధీనం చేసుకున్న డీఆర్ఐ

న్యూఢిల్లీ, ఆగస్టు 29:రెవెన్యూ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్ (డీఆర్ఐ) రహస్య సమాచారం ఆధారంగా దేశ ఈశాన్య ప్రాంత సరిహద్దు వెంబడి.. అస్సాం, మిజోరంలలో.. సోదాలు చేసి 76 కేజీల మెథాంఫేటమిన్ ట్లాబ్లెట్లను స్వాధీనం చేసుకుంది. మత్తుపదార్థాల దొంగచాటు రవాణాను అరికట్టడంలో భాగంగా నిర్వహించిన సోదాల్లో.. '1985 నార్కొటిక్ డ్రగ్స్, సైకోట్రాపిక్ సబ్‌స్టెన్సెస్ (ఎన్‌డీపీఎస్) యాక్టు' నిబంధనల కింద ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు.

సిల్చార్‌లో ఉన్న అస్సాం రైఫిల్స్ 38వ బెటాలియన్ సిబ్బంది సహాయంతో, డీఆర్ఐ అధికారులు 2026 ఆగస్టు 25న సోదాను నిర్వహించారు. సోదా నిర్వహించిన ప్రాంతం సిల్చార్‌కు సుమారు 40 కిలోమీటర్ల దూరంలో గల లాల్‌పానీలో అస్సాం, మణిపూర్ సరిహద్దుకు సమీపంలో ఉంది. అక్కడ 12 చక్రాల వాహనాన్ని అనుమానంతో ఆపారు. మణిపూర్‌లోని జిరిబామ్ నుంచి వస్తున్న అనేక వాహనాల్లో ఆ ట్రక్కు కూడా ఉంది.

ట్రక్కును సోదా చేసినప్పుడు, డ్రైవర్ క్యాబిన్లో డ్రైవరు కూర్చునే సీటుకు వెనుక వైపున ప్రత్యేకంగా తయారు చేసిన ఓ అర ఉండడం చూశారు. ఆ అరలో ఒక్కొక్కటీ కిలో బరువుతో ఇటుక ముక్కల ఆకారంలో ఉన్న 36 ప్యాకెట్లూ, 200 గ్రాముల బరువున్న 100 చిన్న ప్యాకెట్లూ కనిపించాయి. వాటిలో గులాబీ, నారింజ రంగుల ట్యాబ్లెట్లు ఉన్నాయి. అవి మెథాంఫేటమిన్ కావచ్చని అనుమానిస్తున్నారు.

నమూనాలను ప్రాథమికంగా పరీక్షించిన మీదట, ఆ ట్యాబ్లెట్లలో యాంఫిటమిన్ పాళ్లు ఉన్నట్లు తేలింది. ట్రక్కుతో పాటు 56 కిలోల నిషిద్ధ వస్తువులను 1985 ఎన్‌డీపీఎస్ చట్ట నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకున్నారు. వాహనం నడుపుతున్న వ్యక్తిని అరెస్టు చేశారు.

అంతకు ముందు, ఇదే నెల 18న.. మరో సోదాలో మిజోరంలోని ఐజ్వాల్, చంఫై రోడ్డుపై డీఆర్ఐ అధికారులు రహస్య సమాచారం ఆధారంగా ఐజ్వాలకు దాదాపు 30 కి.మీ. దూరాన బంగ్ బంగళాలో ఓ కారును అడ్డగించారు. కారును సోదా చేస్తే 20 కిలోల గులాబీ, నారింజ రంగు ట్యాబ్లెట్లతో నిండిన 64 వేర్వేరు రకాల సరకు పట్టుబడింది. మెథాంఫేటమిన్ అయి ఉండవచ్చన్న అనుమానం వచ్చింది. కారు రెండు వైపులా రాకర్ ప్యానెళ్లు, సైడ్ సిల్స్‌లో ప్రత్యేకంగా రూపొందించిన లోతు అరల్లోనూ, ఫ్యూయల్ ట్యాంకు, కారు ఫ్లోరుకు మధ్య ఉండే చోటులోనూ సరుకును దాచిపెట్టారు.

మరో సోదాలో 20 కిలోల మెథాంఫేటమిన్ స్వాధీనం ఎన్‌డీపీఎస్ పరీక్షా పరికరాలను ఉపయోగించి పరీక్షించిన మీదట ఆ ట్యాబ్లెట్లలో యాంఫిటమిన్ ఉందన్న విషయం బయటపడింది. ఆ డ్రగ్స్‌ను మయన్మార్ నుంచి జోఖావథర్, చంఫై సెక్టరు మీదుగా మిజోరానికి దొంగచాటుగా చేరవేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. 20 కిలోల నిషిద్ధ వస్తువులతో పాటు, ఆ వస్తువులను రవాణా చేయడానికి ఉపయోగించిన కారును 1985 ఎన్‌డీపీఎస్ చట్ట నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకున్నారు. కారు డ్రైవరును అరెస్టు చేశారు.

మెథాంఫేటమిన్ శక్తిమంతమైన కృత్రిమ మానసిక ఉత్తేజకం. ఒకసారి వాడినవాళ్లు దీనికి బానిసలుగా మారతారు. గంభీర శారీరక, మానసిక దుష్పరిణామాలనూ కలగజేయొచ్చు. దీంతో గుండెకు సంబంధించిన సంక్లిష్టతలు, ఆందోళన పెరగడం, పరధ్యానం, ఉన్మాదానికి దారితీసే ప్రమాదాలు ఉంటాయి. చాలా కాలం వాడిన వారు దీనికి బానిసగా మారుతారు. కేంద్ర నాడీ వ్యవస్థ (వెన్నుపాము, మెదడు) ప్రభావితమవుతుంది. మెథాంఫేటమిన్‌ను 1985 ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం మానసిక రోగ కారక పదార్థంగా నోటిఫై చేశారు. దీని అక్రమ తయారీ, దీనిని దగ్గర అట్టిపెట్టుకోవడం, రవాణా చేయడం, దొంగచాటుగా తరలించడం నేరం.

# నిరుపేద కుటుంబానికి అండగా మాజీ ఎమ్మెల్యే



నల్గొండ, ఆగస్టు 29: రామకృష్ణాపూర్ భగత్‌సింగ్ నగర్ హట్స్ ప్రాంతానికి చెందిన సతీష్ హెయిర్ సెలూన్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. ఇటీవల అనారోగ్యంతో ఆయన మృతి చెందడంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. ఈ విషయం నాయి బ్రాహ్మణ సంఘం నాయకుల ద్వారా మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు దృష్టికి వెళ్లింది. విషయం తెలుసుకున్న నల్లాల ఓదెలు వెంటనే స్పందించారు. శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మృతుడి కుమార్తె చదువుకు సంబంధించిన ఖర్చులను తానే భరిస్తానని హామీ ఇచ్చారు.


ఈ సందర్భంగా కుమార్తె విద్య కోసం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నిరుపేద కుటుంబానికి విద్యాపరంగా అండగా నిలవడం పట్ల కుటుంబ సభ్యులు, నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు నల్లాల ఓదెలుకు కృతజ్ఞతలు తెలిపారు. విద్య కొనసాగించేందుకు అవసరమైన సహకారం అందిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు గాండ్ల సమ్మయ్య, నందిపేట సదానందం, పాఠశాల ఉపాధ్యాయులు ఎం.వెంకటేశ్వర్లు, పి.వెంకటేశ్వరరావు, తేజావత్ రామకృష్ణ నాయక్, పీడీ రాజేంద్రప్రసాద్, నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులు సూత్రాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సమగ్ర సవరణపై అవగాహన..

ఖమ్మం, ఆగస్టు 29: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవడంతో పాటు ఓటర్ల జాబితాలోని వివరాలను పరిశీలించుకుని అవసరమైన మార్పులు, సవరణలు చేసుకోవాలని కాంగ్రెస్ నాయకుడు చిరుమామిళ్ల నాగేశ్వరావు సూచించారు. ఖమ్మంలోని ఇందిరానగర్ హైస్కూల్‌లో ఎన్నికల నమోదు అధికారి రాజ్‌కుమార్, సూపర్‌వైజర్ దివ్య ఆధ్వర్యంలో నోటీసులు జారీ అయిన ఓటర్లకు విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 250 మంది ఓటర్ల నుంచి సంబంధిత పత్రాలను స్వీకరించి వారి వివరాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా నాగేశ్వరావు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువత కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఓటర్ల జాబితాలో పేరు, వయసు, ఫొటో తదితర వివరాల్లో తప్పులు ఉంటే నిర్ణీత సమయంలో సవరణలు చేసుకోవాలని సూచించారు. చిరునామా మారిన వారు కూడా తమ ఓటరు వివరాలను నవీకరించుకోవచ్చన్నారు. ప్రతి ఓటరు జాబితాలో తమ పేరు, వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని, ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన ఓటు హక్కును ప్రతి అర్హుడు బాధ్యతాయుతంగా వినియోగించుకునేలా నమోదు చేసుకోవాలని కోరారు.

# గ్రామీణ క్రీడాకారులే దేశ ప్రతిష్టను పెంచేది: ముత్తయ్య రెడ్డి




కరీంనగర్, ఆగస్టు 29:గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులకు సరైన ప్రోత్సాహం, శిక్షణ, అవకాశాలు కల్పిస్తే వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశ ప్రతిష్టను ఇనుమడింపజేస్తారని జగిత్యాల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్య రెడ్డి అన్నారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మెట్‌పల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి ఆలయం నుంచి క్రీడా ర్యాలీని ప్రారంభించారు. కొత్త బస్టాండ్, శాస్త్రి విగ్రహం, కూరగాయల మార్కెట్ మీదుగా జాతీయ రహదారిపై సుమారు రెండు కిలోమీటర్ల మేర ర్యాలీ కొనసాగింది.

ఈ సందర్భంగా ముత్తయ్య రెడ్డి మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే పిల్లల్లో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడలకు కూడా సమయం కేటాయించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభకు కొదవ లేదని, సరైన అవకాశాలు లభిస్తే ఎంతోమంది ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి వస్తారని తెలిపారు. అనంతరం వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గజల్ రాందాస్, జ్ఞానేశ్వర్, కొమురయ్య, కార్తీక్, క్రీడాకారుల తల్లిదండ్రులు మల్లికార్జున, వెంకటేశ్వర్లు, విద్యార్థులు, క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జేజేఎం 2.0 కింద స్థానిక విద్యాసంస్థల విద్యార్థుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలని డీడీడబ్ల్యూఎస్ సూచన

న్యూఢిల్లీ, ఆగష్టు 29:క్షేత్ర స్థాయి అభ్యాసం, జ్ఞాన భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే ముఖ్యమైన కార్యక్రమంలో భాగంగా జల శక్తి మంత్రిత్వశాఖలోని తాగునీరు, పారిశుధ్య విభాగం (డీడీడబ్ల్యూఎస్) రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను స్థానిక కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలను ప్రోత్సహించి జల జీవన్ మిషన్ (జేజేఎం) 2.0 కింద అమలవుతున్న ఉత్తమ విధానాలను అధ్యయనం చేసి, వాటిని నమోదు చేసి ప్రచురించాలని కోరింది.

జల జీవన్ మిషన్ ప్రారంభమైనప్పటి నుంచి గ్రామీణ తాగునీటి రంగంలో ఒక ముఖ్యమైన అభివృద్ధి కార్యక్రమంగా నిలిచింది. దీని ఫలితంగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో సమాజ భాగస్వామ్యం, నీటి వనరుల సుస్థిరత, నీటి నాణ్యత నిర్వహణ, నిర్వహణ?పరిరక్షణ, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, వికేంద్రీకృత పాలన వంటి రంగాల్లో అనేక ఆదర్శవంతమైన విధానాలు వెలుగులోకి వచ్చాయి.

క్షేత్రస్థాయి నూతన విధానాల విశిష్టతను పరిగణనలోకి తీసుకుని, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఈ కింది చర్యలు తీసుకోవాలని ప్రోత్సహించారు.

స్థానిక కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలను భాగస్వామ్యం చేసి జేజేఎం 2.0 కింద ఎంపిక చేసిన కేస్ స్టడీలు, ఉత్తమ విధానాలను అధ్యయనం చేసి నమోదు చేయాలని సూచించారు.

ఈ అధ్యయనాల ఫలితాలను విద్యా జర్నళ్లు, సంస్థాగత నివేదికలు, న్యూస్‌లెటర్లు, పరిశోధనా పత్రాలు, వెబ్‌సైట్లు తదితర వేదికల ద్వారా ప్రచురించాలని కోరారు. తద్వారా ఆధారాలతో కూడిన జ్ఞాన భాగస్వామ్యం, విజయవంతమైన విధానాల పునరావృతికి అవకాశం కలుగుతుందని తెలిపారు.

తగిన కేస్ స్టడీలు, సందర్శన ప్రదేశాలను గుర్తించి, స్థానిక విద్యాసంస్థలు, పాఠశాలలు, జిల్లా నీరు?పారిశుధ్య మిషన్లు (డీడబ్ల్యూఎస్ఎంలు), గ్రామ పంచాయతీలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

సమీప పాఠశాలలకు చెందిన ఉన్నత పాఠశాల, సీనియర్ మాధ్యమిక విద్యార్థుల కోసం బహుళ గ్రామాల నీటి సరఫరా పథకాలు (ఎంవీఎస్), నీటి శుద్ధి కేంద్రాలు (డబ్ల్యూటీపీలు), నీటిని తీసుకునే బావులు,సూపర్‌వైజరీ కంట్రోల్, డేటా అక్విజిషన్ (ఎస్‌సీఏడీఏ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్, కాలిబ్రేషన్ లాబొరేటరీస్ (ఎన్ఏబీఎల్) గుర్తింపు పొందిన నీటి పరీక్షా ప్రయోగశాలలకు సందర్శనలు నిర్వహించాలని సూచించారు.

2026 సెప్టెంబర్ చివరి నాటికి ప్రతి జిల్లాలో స్థానిక విద్యాసంస్థల భాగస్వామ్యంతో కనీసం ఒక విద్యార్థుల సందర్శన, ఒక కేస్ స్టడీ లేదా ఉత్తమ విధానాన్ని ప్రచురించేలా ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఈ కార్యక్రమం ద్వారా జేజేఎం 2.0 క్షేత్రస్థాయి అనుభవాల నుంచి నేర్చుకునే విధానాన్ని మరింత బలోపేతం చేయడం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం, గ్రామీణ నీటి సరఫరాలో విజయవంతమైన విధానాలను మరింత విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా పెట్టుకుంది. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో దీర్ఘకాలిక నీటి భద్రతను మరింత బలోపేతం చేయడానికి దోహదపడనుంది.

# ఊపందుకున్న పరివర్తన్ పథకం

న్యూఢిల్లీ, ఆగష్టు 29:కేంద్ర మంత్రివర్గం 'పరివర్తన్' (రవాణా వాయు కాలుష్యం, నెట్‌వర్క్ ఉద్గారాలను తగ్గించడానికి వాహన ఆస్తుల వేగవంతమైన పునరుద్ధరణ, ప్రోత్సాహక కార్యక్రమం) పథకాన్ని 2026 జూన్ 3వ తేదీన ఆమోదించింది. ఢిల్లీ జాతీయ రాజధాని ప్రాంతం, హర్యానా, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్ ఎన్‌సీఆర్ జిల్లాల్లో నమోదైన, భారత్ స్టేజ్ (బీఎస్) -ఎం లేదా అంతకు ముందరి ఉద్గార నిబంధనలకు అనుగుణంగా ఉన్న 2 లక్షలకు పైగా ట్రక్కులు, బస్సుల స్థానంలో... ఈ పథకం కింద బిఎస్-ఎవ లేదా మరింత కఠినమైన నిబంధనలకు అనుగుణంగా ఉండే వాహనాలు లేదా ఎలక్ట్రిక్ ఎా ఎ˘ా ఎా ల న ం ప్రవేశపెట్టనున్నారు. గృహ నిర్మాణ, పట్టణ వ్యవహా రాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యం లోని జాతీయ రాజధాని ప్రాంత ప్రణాళికా బోర్డు ద్వారా ఈ పథకానికి నిధులు సమకూరుతున్నాయి. దీనిని రహదారి రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ అమలు చేస్తోంది.

ఈ పథకం మొత్తం ఆర్థిక వ్యయం రూ. 9,585 కోట్లు. కేంద్ర ప్రభుత్వం నుంచి లభించే రూ. 5,041 కోట్ల బడ్జెట్ మద్దతు ఇందులో భాగంగా ఉంది. బిఎస్-ఎవ లేదా అంతకంటే కఠినమైన నిబంధనలకు అనుగుణంగా ఉండే కొత్త డీజిల్ లేదా సీఎన్‌జీ వాహనాలను లేదా ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేసే అర్హులైన లబ్ధిదారులు ఈ పథకం కింద కింది ప్రోత్సాహక ప్యాకేజీని పొందేందుకు అర్హులు:

10 సంవత్సరాల పాటు 100 శాతం రహదారి పన్ను మినహాయింపు. రిజిస్ట్రేషన్ రుసుముల పూర్తి మినహాయింపు. (ఢిల్లీ, హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు ఇప్పటికే దీనికి సంబంధించి నోటిఫికేషన్లు జారీ చేశాయి).

దీనిలో భాగంగా ఉన్న ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ (ఓఈఎంల) ద్వారా ఎక్స్-షోరూమ్ ధరపై కనీసం 8 శాతం తగ్గింపు.

బిఎస్-ఎవ డీజిల్ లేదా సీఎన్‌జీ వాహనాల కొనుగోలుదారులకు వాహన రకాన్ని బట్టి ఐదేళ్లపాటు నెలకు రూ. 1,200 నుంచి రూ. 4,800 వరకు విలువైన ఇంధన వోచర్లు అందిస్తారు. ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుదారులకు రూ. 64,000 నుంచి రూ. 2.56 లక్షల వరకు ప్రోత్సాహకం ఏకమొత్తంగా అందిస్తారు.

ఈ పథకాన్ని 14 జూలై 2026న ప్రారంభించారు. 27 ఆగస్టు 2026 నాటికి పరివర్తన్ పోర్టల్‌లో 1,300 మందికి పైగా లబ్ధిదారులు నమోదు చేసుకున్నారు. ఆర్థిక సహాయాన్ని అందించడానికి, వాహన రుణాల వడ్డీపై రాయితీనివ్వడం కోసం 42 బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీలు) ఈ పథకంలో భాగమయ్యాయి. పరిశ్రమ తరపున, అర్హులైన లబ్ధిదారులకు రాయితీని అందించడానికి 15 ఆటో ఓఈఎంలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు.

ఈ పథకం కింద లభించే ప్రయోజనాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ గురించి ఢిల్లీ-ఎన్‌సిఆర్ వ్యాప్తంగా గల అర్హులైన వాహన యజమానులకు తెలియజేయడానికి బహుముఖ అవగాహన ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

ఈ పథకం కింద లబ్ధిదారుల రిజిస్ట్రేషన్, భాగస్వామ్యాన్ని విస్తృతం చేసే లక్ష్యంతో ఈ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాతో పాటు... ఢిల్లీ-ఎన్‌సీఆర్ వ్యాప్తంగా ఉన్న ఇంధన స్టేషన్లు, ట్రాన్స్‌పోర్ట్ నగర్‌లు, టోల్ ప్లాజాలు, ప్రాంతీయ రవాణా కార్యాలయాల వద్ద బహిరంగ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు.

# వ్యవసాయశాఖ సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు



మహబూబ్‌నగర్, ఆగష్టు 29: వ్యవసాయశాఖ అందించే సలహాలు, సూచనలు పాటిస్తే పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ అధికారి వి.రాజు అన్నారు. శనివారం జుక్కల్ మండలంలోని గుండూర్ గ్రామ శివారులో సాగు చేస్తున్న పత్తి, సోయాబీన్ తదితర పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పంటల పరిస్థితిని రైతులను అడిగి తెలుసుకున్నారు. పంటలను ఆశించే చీడపీడలను గుర్తించి సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైన పిచికారీ మందుల వినియోగం, వాటి మోతాదు, పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు.

పంటల సాగులో శాస్త్రీయ పద్ధతులను పాటించడం ద్వారా దిగుబడులను పెంచుకోవచ్చని తెలిపారు. క్షేత్రస్థాయిలో పంటల సాగును పరిశీలించి రైతులకు అవసరమైన సూచనలు అందించాలని డీసీఎస్ వాలంటీర్లను ఆదేశించారు. రైతులు సాగు చేస్తున్న పంటలకు సంబంధించిన వివరాలను క్షేత్రస్థాయిలో నమోదు చేయడంతో పాటు పంటల ఫొటోలను తీసి ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు.

రైతులకు పంటల సాగు, చీడపీడల నివారణ, సస్యరక్షణ చర్యలకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలని వి.రాజు సూచించారు. వ్యవసాయశాఖ అందించే సాంకేతిక సలహాలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సిద్ధాపురే కాశీనాథ్, వ్యవసాయ విస్తరణ అధికారులు డి.పండరి, జి.శ్రీలేఖ, మల్లికార్జున్, అనిల్, గజానంద్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ఓటర్ల జాబితా నమోదు ప్రక్రియ పరిశీలన

## ఓటర్ల వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలి: ఎంపీడీవో

మహబూబ్‌నగర్, ఆగష్టు 29: ఎస్ఐఆర్ ఓటర్ల జాబితా తయారీలో భాగంగా వివరాలు సక్రమంగా నమోదు కాని ఓటర్లకు నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో భీమ్‌గల్ మండలం బెజ్జోరా గ్రామంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. నోటీసులు అందుకున్న వారి నుంచి అవసరమైన వివరాలను సేకరించి, ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో బూత్ స్థాయి అధికారులు నమోదు చేస్తున్న ప్రక్రియను ఎంపీడీవో జి. సంతోష్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు.



ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. ఓటర్ల జాబితాలో వివరాలు సక్రమంగా నమోదు కాని వారి నుంచి వివరాల సేకరణ కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు జాబితాలో సక్రమంగా నమోదయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు సహకరించాలని ఎంపీడీవో కోరారు. ఓటర్ల నుంచి సేకరించే వివరాలను ఒకటికి రెండుసార్లు పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు వివరాలు కూడా జాబితాలో నమోదు కాకుండా మిగిలిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కార్తిక్, ఉప సర్పంచ్ మూడేళ్ల బాలయ్య, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, జీపీఓ, బూత్ స్థాయి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 'బతుకునిచ్చే భాష తెలుగే'

**మాతృభాషపై పట్టు సాదించి ఉత్తమ పరిశోధనలు చేయాలి**

**ప్రముఖ విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు, యోగా గురువు మాదగాని శంకరయ్య**




నల్గొండ, ఆగష్టు 29:బతుకునిచ్చే భాష తెలుగు. అయితే మాతృభాషలో ఉన్న మాదుర్యంతో మరే భాషలో ఉండదని నేటి తరం మాతృభాషను విస్మరించకుండా దాని మాదుర్యం, విశిష్టతను తగ్గించకుండా విస్తృతమైన రచనలు చేయాలని ప్రముఖ విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు, యోగా గురువు మాదగాని శంకరయ్య అన్నారు. తెలుగు భాష దినోత్సవం, ప్రముఖ రచయిత గిడుగు రామ్మూర్తి పంతులు 184వ జయంతి వేడుకలను నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో కళాశాల సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలువేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు.

ఆంగ్ల భాష కేవలం జ్ఞానాన్ని ఇస్తే, తెలుగు భాష మనిషికి బతుకునిస్తుందన్నారు. విద్యార్థులకు మాట్లాడే నైపుణ్యం ఉన్నప్పటికీ రాయడంలో లోపాలున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంగ్లభాషను సైతం ఇంగ్లీష్ లిపిలో రాసే అలవాటును మానుకోవాలని కోరారు. 2020-27 విద్యా సం. నుంచి డిగ్రీ తెలుగులో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి తన తండ్రి మాదగాని పెంటయ్య జ్ఞాపకార్థం బంగారు పతకం అందచేస్తామని ప్రకటించారు. తెలుగు విభాగం నిర్వహించే కథా సెమినార్, సాంస్కృతిక పోటీలకు ఆర్థిక సహాయం చేస్తామని స్పష్టం చేశారు.

తెలుగు అధ్యాపకుడు డా.ఇడురోజు శ్రీనివాసాచారి మాట్లాడుతూ.. గిడుగు పోరాట స్ఫూర్తిని, కఠినమైన పదాలు, దీర్ఘ సమాసాలతో ఉన్న తెలుగును వ్యవహారిక భాషగా మార్చడానికి గిడుగు దశాబ్దాల పాటు పోరాడారని గుర్తు చేశారు. ఆ పోరాట ఫలితంగానే నేడు మనం తెలుగు భాషా దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.సముద్రాల ఉపేందర్, వైస్ ప్రిన్సిపాల్ డా.పరంగి రవికుమార్, తెలుగు విభాగం అధ్యాపకుడు డా.వెల్దండి శ్రీధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు అసిస్టెంట్ ప్రొ.ఆర్.మురళికి మేజర్ ధ్యాన్ చంద్ ఎక్సలెన్స్ అవార్డు

## ఎంజీయూ వీసీ, రిజిస్ట్రార్, సహచర అధ్యాపకుల అభినందనలుతెలంగాణ టూరిజం

నల్గొండ, ఆగష్టు 29:మహాత్మాగాంధీ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఆర్.మురళికి ఒలింపిక్స్ ప్రఖ్యాతిగాంచిన హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ ఎక్సలెన్స్ అవార్డు దక్కింది. తెలంగాణ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని అందించిన అవార్డుల్లో రాష్ట్ర స్థాయిలో మురళి ఎంపికయ్యారు. శనివారం హైద్రాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవంతో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.బాలకృష్ణారెడ్డి, తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డా.రాజ్ నారాయణ ముదిరాజ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కాగా మురళీ గత 18 సం.రాలుగా ఎంజీయూ, అనుబంధంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాని కళాశాలలోని వందలాది మంది విద్యారులను ఉత్తమ క్రీడాకారులుగా తయారు చేసి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడంతోపాటు వర్సిటీకి ఖ్యాతి తెప్పించడంలో కృషి చేశారు. అంతే కాకుండా తాను రాసిని పరిశోధన గ్రంథాలు జాతీయ, అంతార్జాతీయ సదస్సులో పరిశోధన పత్రాలను సమర్పించారు. అవార్డు అందుకున్న మురళిని ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ కొప్పుల అంజిరెడ్డి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ ప్రొ.ఆకుల రవి, స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ మద్దిలేటి, సహచార అధ్యాపకులు, ఫిజికల్ డైరెర్స్, విద్యార్థులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

**గిరిజనతండా నుండి అంతర్జాతీయ స్థాయికి**

మురళి అడవిదేవులపల్లి మండలం ఇందిరానగర్ గిరిజన తండాలో ప్రాథమిక విద్య అభ్యసించాడు. అనంతరం చలకుర్తి నవోదయాలో అటు విమ్మట ఉస్మానియా యూనివర్సిటీ నుండి డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్, పీహెచ్‌డీ పట్టా పొందారు.

పోలీస్ శాఖలో ఎస్ఐ, కానిస్టేబుల్, ఆర్పీఎఫ్ ఎంపికలో యూనివర్సిటీ విద్యార్థులకు ప్రోత్సాహంతో పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో సెలెక్ట్ అయ్యారు. దేశ, విదేశాలలో క్రీడలలో పరిశోధన పత్రాలను, క్రీడారంగంలో అంతర్జాతీయ, జాతీయ సదస్సుల్లో పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకు పాదయాత్ర

**టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ఎర్రుపాలెం తాసీల్దార్‌కు వినతిపత్రం-అఖిలపక్షాల సంఘీభావం**

ఖమ్మం, ఆగష్టు 29:రాష్ట్రంలోని జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఖమ్మం జిల్లా స్థాయి పాదయాత్ర శనివారం ఎర్రుపాలెం మండలంలో కొనసాగింది. మండల కేంద్రంలోని రింగ్ సెంటర్ నుండి స్థానిక జర్నలిస్ట్‌లతో కలిసి ర్యాలీగా బయల్దేరి గాంధీ బొమ్మ సెంటర్‌లో మహాత్మాగాంధీ విగ్రహానికి, రైల్వే స్టేషన్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ కె. సునీత ఎలిజిబెత్‌కు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసేలా ప్రభుత్వానికి తమ వినతిని తెలియజేయాలని కోరారు.

పాదయాత్రకు మండలంలోని వివిధ రాజకీయ పార్టీలు, ఉద్యోగ సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు, గ్రామ పంచాయతీ సర్పంచ్ నంద్రు అశ్విని, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు శీలం కవిత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొగ్గుల శ్రీనివాసరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు గూడూరు వెంకటేశ్వరరెడ్డి, దోమందుల సామేలు, బీజేపీ మండల అధ్యక్షుడు అనుమోలు సురేష్, నూతక్కి నరసింహారావు, సీపీఎం నాయకులు గామాసు జోగయ్య, నాగులవంచ వెంకట రామయ్య, యూటీఎఫ్ నాయకులు అనుమోలు కోటేశ్వరరావు, కంచర్ల శ్రీనివాసరావు, నంద్రు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పాదయాత్ర నాయకులు మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ నిత్యం ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చే జర్నలిస్టుల సొంతింటి కలను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. తమ పాదయాత్రకు సంఘీభావం తెలిపిన మండల అఖిలపక్షం నాయకులకు జర్నలిస్టులు కృతజ్ఞతలు తెలిపారు.

టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి తేనే వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు దువ్వా సాగర్, సహాయ కార్యదర్శి కొత్త యాకేష్, టిబీజేఏ జిల్లా కార్యదర్శి మానుకొండ రవికిరణ్, స్టేట్ కౌన్సిల్ సభ్యురాలు నలబోల మధుశ్రీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.ఎస్. చక్రవర్తి, రాష్ట్ర నాయకులు మాండ్డి నాగేందర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, దగ్గుపాటి మాధవరావు, జానీ పాషా, కొరకొప్పుల రాంబాబు, గుడిమెట్ల మోహన్‌రావు, టిబీజేఏ కెమెరామెన్స్ జిల్లా కార్యదర్శి భూక్యా గణేష్, కోశాధికారి యూసఫ్, అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు అర్షద్, నాయకులు గంగుల గోపి, మందా శరత్, చిర్రా పవన్, పాల్గొన్నారు.

# జీవో 97ను రద్దు చేయాలి : ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వరంగల్, ఆగష్టు 29:జీవో 97 రద్దు చేయాలని ఫిరాయింపు ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కడియం శ్రీహరి మాట్లాడుతూ.. మాజీ విద్యాశాఖ మంత్రిగా జీవో 97ను రద్దు చేయాలి. పాలిటెక్నిక్ ఎడ్యుకేషన్‌ను ఇంజినీరింగ్ ఎడ్యుకేషన్‌తో కలిపే ఉంచాలని డిమాండ్ చేస్తున్నానన్నారు.

పాలిటెక్నిక్ ఎడ్యుకేషన్‌ను లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ కిందకు తీసుకురావొద్దు.. తద్వారా విద్యార్థులకు లేని అపోహాలు ఏర్పడుతున్నాయి. వేం ఇంజినీరింగ్ చదువుకున్నాం.. లేబర్ డిపార్ట్‌మెంట్‌కు పోతమా..? అనే లేని అపోహ వాళ్ల మనసులోకి వచ్చింది. స్కిల్ యూనివర్సిటీకి దీన్ని అనుసంధానం చేసి పాలిటెక్నిక్ విద్యతోపాటు కొన్ని స్కిల్స్ నేర్పిస్తే వాళ్లకు వెంటనే ఉద్యోగాలొస్తయని



ఆలోచన ప్రభుత్వం చేసి.. కానీ విద్యార్థులంతా కూడా మేం లేబర్ డిపార్ట్‌మెంట్‌లోకి వెళ్లం. రేపు పాలిటెక్నిక్ అయిపోతే ఇంజినీరింగ్ పోవాల్సినోళ్లం.. వైట్ కాలర్ జాబ్ చేయాల్సినవాళ్లమే తప్ప వేం కిందికి పోమనే ఆలోచనలో ఉన్నరు.. వాళ్లు కూడా కరెక్టే.. కాబట్టి నేను ప్రభుత్వాన్నికోరుతున్నానన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యను పరిష్కరించేందుకు ఒక కమిటీ కూడా వేశారు. ఆ కమిటీ వీటన్నింటిని కూడా అధ్యయనం చేస్తున్నది.. నేను ఆ కమిటీకి సూచించేది ఒకటే. పాలిటెక్నిక్ విద్యార్థులను టెక్నికల్ ఎడ్యుకేషన్‌లోనే కొనసాగించాలి. పాలిటెక్నిక్ పూర్తయిన తర్వాత ఇంజనీరింగ్ వెళ్లడానికి లేటరల్ ఎంట్రీని కూడా ఉంచండి. వాళ్లను దేశవ్యాప్తంగా పాలిటెక్నిక్స్ ఎలా ఉన్నాయో అవన్నీ ఏఐసీటీఈ కింద ఉన్నాయి. మన రాష్ట్రంలో కూడా అదే పద్ధతి కొనసాగితే బాగుంటుంది. ఆ విద్యార్థులు ఒక రకమైన అపోహాలో, భయాందోళనలో ఉన్నారు. వాళ్ల అపోహలను నివృత్తి చేయాల్సిన అవసరముందన్నారు.

# రైతుల శ్రేయస్సు కోసమే సహకార సంఘాలు

## -ప్రతి రైతు సహకార సంఘంలో సభ్యత్వం తీసుకోవాలి: షబ్బీర్ అలీ



మహబూబ్‌నగర్, ఆగష్టు 29:రైతుల శ్రేయస్సు కోసమే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు పనిచేస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. శనివారం మండలంలోని రామేశ్వరపల్లి గ్రామ సహకార సంఘం చైర్మన్ బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో షబ్బీర్ అలీ మాట్లాడుతూ సహకార సంఘాలు వ్యాపారానికే పరిమితం కాకుండా రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు పనిచేస్తున్నాయని తెలిపారు.

పట్టా పాస్‌బుక్ ఉన్న ప్రతి రైతు సహకార సంఘంలో సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. సభ్యులకు అవసరమైన స్వల్ప, దీర్ఘకాలిక రుణాలతో పాటు ఎరువులు, విత్తనాలు అందిస్తున్నట్లు తెలిపారు. సభ్యత్వం ఉన్న ప్రతి రైతుకు బీమా సౌకర్యం కూడా కల్పిస్తున్నామని చెప్పారు. రైతుల అభ్యున్నతి కోసం సహకార సంఘాలు ఎంతగానో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఇంద్రకరణ్‌రెడ్డి రైతులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యత పాలకవర్గంపై ఉందన్నారు. గత ప్రభుత్వం సహకార వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సహకార సంఘాలను మరింత బలోపేతం చేసి రైతులకు చేరువగా ఉండేలా తగిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని చెప్పారు. మహిళల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేస్తున్నారని, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతు భరోసా పథకం కింద సకాలంలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశామని గుర్తు చేశారు. సహకార సంఘాల ద్వారా రైతులకు అందాల్సిన ఎరువులు పక్కదారి పట్టకుండా యాప్ విధానం ద్వారా రైతులకు అందిస్తున్నామని తెలిపారు. రైతులు ప్రతిసారీ ఒకే రకమైన పంటలు సాగు చేయకుండా పంట మార్పిడిపై దృష్టి సారించాలని సూచించారు. రైతులు పండించిన ప్రతి పంటను ప్రభుత్వం గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తుందని తెలిపారు. పంట మార్పిడి ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని పేర్కొన్నారు. గ్రామ గ్రామాన సహకార వ్యవస్థను ప్రభుత్వం మరింత బలోపేతం చేస్తుందని అన్నారు.

అనంతరం సొసైటీ పాలకవర్గంతో షబ్బీర్ అలీ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షట్కర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ చేపూరి రాణి రాజు, ఉప సర్పంచ్ వినోద్ గౌడ్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సూర్యకాంతరెడ్డి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార బ్యాంకు మాజీ చైర్మన్ ఎడ్ల రాజిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, తిప్పాపూర్ సొసైటీ అధ్యక్షుడు భీమ్‌రెడ్డి, అంతంపల్లి సొసైటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదర్శన్, తహసీల్దార్ సునీత, ఎంపీడీవో సవితారెడ్డి, సొసైటీ సీఈవో శంకర్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విచ్చలవిడిగా చెత్త వేస్తే జరిమానా తప్పదు

## -సారపాక మేజర్ పంచాయతీ సర్పంచ్ హెచ్చరిక

ఖమ్మం, ఆగష్టు 29:బూర్గంపహాడ్ మండల పరిధిలోని పారిశ్రామికవాడ సారపాక మేజర్ పంచాయతీలో రోడ్లపై, హెచ్చరిక బోర్డుల వద్ద ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తే జరిమానా తప్పదని సర్పంచ్ గుగులోత్ కిశోర్ నాయక్ హెచ్చరించారు. శనివారం పంచాయతీలో పర్యటించిన ఆయన హెచ్చరిక బోర్డులు ఉన్న చోట చెత్తను వేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లను మనమే శుభ్రంగా ఉంచుకోకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. పరిశుభ్రత లేకుండా ఇలా రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం వేస్తే ప్రజల ఆరోగ్యాల పరిస్థితి ఏమిటని మండిపడ్డారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం తరఫున ప్రజలకు ఆయన పలు సూచనలు చేశారు.

మేజర్ పంచాయతీలో ప్రజలు ఇళ్లలో చెత్తను ఒక డబ్బాలో పెట్టి పంచాయతీ వాహనం వచ్చినప్పుడు అందులో మాత్రమే వేయాలని, రోడ్లపై, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన ప్రదేశాల్లో చెత్తను పారబోస్తే సహించేదిలేదని, అలాంటి వారికి జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత శుభ్రతను పాటించాలని సూచించారు. ఆయన వెంట దామెర ఆదినారాయణ, ఎల్లంకి రాము, ఓబుల్రెడ్డి, కృష్ణ ఉన్నారు.

# అంతర్జాతీయ క్రీడల్లో ఎంజీయూ విద్యార్థులు రాణించాలి : రిజిస్ట్రార్ అంజిరెడ్డి



నల్గొండ, ఆగష్టు 29:చదువుతో పాటు ఎంజీయూ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించి ఖ్యాతి చాటాలని ఎంజీయూ రిజిస్ట్రార్ ప్రొ.కొప్పుల అంజిరెడ్డి అన్నారు. ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో శనివారం వర్సిటీలో నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత క్రీడా దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రటానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. శ్రమిస్తే సకలం సాధ్యమన్నారు. అయితే శ్రమ ఇష్టంతో జరుగాలన్నారు. శ్రమకు తగిన ప్రతిఫలం ఉంటుందని, కఠిన శ్రమతో పేదరికాన్ని, వెనుకబాటుతనాన్ని జయించి విజయాలు సాధించవచ్చని తెలిపారు. విద్యార్థులు వర్సిటీలోని క్రీడా సదుపాయాలను సద్వినియోగం చేసుకుని అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని పిలుపునిచ్చారు. నేటి యువతను పట్టిపీడిస్తున్న ఇంటర్నెట్ వ్యాపకానికి క్రీడలే సరైన పరిష్కారమని. ఇవి నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

గ్రామీణ పేదరిక నేపథ్యాన్ని ఎదుర్కొంటూ ఒలింపిక్ పతకం సాధించడమే తన లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఎంజీయూ విద్యార్థిని నారిమల్ల ప్రవళిక, ఆమె తల్లిని విజయను ఘనంగా సన్మానించారు. అనంతరం క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులు, అధ్యాపకులకు అతిథులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంజీయూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ ప్రొ.ఆకుల రవి, స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ డా.పి.మద్దిలేటి, పరీక్షల విభాగం అసిస్టెంట్ కంట్రోలర్ డా.లక్ష్మీప్రభ, క్రీడా కోచ్ పరశురామ్, ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు అసిస్టెంట్ ప్రొ.డా.వై.శ్రీనివాస్‌రెడ్డి, ప్రొ.శ్రీలక్ష్మి, అసిస్టెంట్ ప్రొ.డా.మారం వెంకటరమణరెడ్డి, స్పోర్ట్స్ బోర్డు కార్యాలయ అసిస్టెంట్ ఆర్.హరికిష రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శుభ్రంగా ఉన్న ఖదీం కబ్రస్థాన్‌ను వినియోగంలోకి తేవాలి



ఆదిలాబాద్, ఆగష్టు 29: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఖదీం కబ్రస్థాన్ పరిసర ప్రాంతాన్ని శుభ్రపరిచి, అవసరమైన మౌలిక వసతులు కల్పించి వినియోగంలోకి తీసుకురావాలని ఏఐఎంఐఎం నాయకులు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు శనివారం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సయ్యద్ ఇబ్ని ఆఫాన్ మాట్లాడుతూ.. కబ్రస్థాన్ ప్రాంతంలో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగి అటవీ ప్రాంతాన్ని తలపించేలా మారిందన్నారు.

దీంతో మైనార్టీ కుటుంబాలకు చెందిన మృతదేహాలను ఖననం చేసేందుకు తీసుకువచ్చే కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అదేవిధంగా కబ్రస్థాన్ పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలు విషపూరిత జంతువుల సంచారంతో భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి నిధులు మంజూరు చేసి ప్రహరీ గోడ నిర్మాణం, సెంట్రల్ లైటింగ్, తాగునీటి సౌకర్యంతో పాటు ఇతర మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎంఐఎం మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు మొహమ్మద్ సాహిర్, మాజీ కౌన్సిలర్ సయ్యద్ హబీబ్, సమీర్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ కార్యకర్తకు ఆర్థిక సాయం

నల్గొండ, ఆగష్టు 29: చండూరు మండలం గుండ్రపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త కురుపాటి శ్రీను మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మరణించింది. విషయం తెలుసుకున్న గుండ్రపల్లి గ్రామ సర్పంచ్ ఉజ్జిని ఉషా అనిల్ రావు, బీఆర్ఎస్ పార్టీ చండూరు మండల అధ్యక్షుడు బొమ్మరబోయిన వెంకన్నతో కలిసి శనివారం శ్రీను కుటుంబాన్ని పరామర్శించి రూ.10,000/- ఆర్థిక సహాయం అందజేశారు, ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ టేకుల వినోద్ రెడ్డి, వార్డు మెంబర్లు తీగల వెంకన్న, వడ్డమల్ల మధు, పెండ్యాల ఉపేందర్, దామెర అనిల్, కురుపాటి రాజు, కురుపాటి సాయిలు, కురుపాటి కృష్ణ, నక్క కృష్ణయ్య, క్రాంతి, నవీన్, కొమ్మనపల్లి శ్రీను, భూతరాజు శంకర్ పాల్గొన్నారు.

# నీట్ (పీజీ) పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేయాలి..

## -నిజామాబాద్ కలెక్టర్ భవేష్ మిశ్రా

## పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



నిజామాబాద్, ఆగష్టు 29: నీట్ (పీజీ) పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేయాలని నిజామాబాద్ కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. నీట్(పీజీ) పరీక్ష కేంద్రాలను కలెక్టర్ భవేష్ మిశ్రా శనివారం క్షేత్రస్థాయిలో సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. నిజామాబాద్ జిల్లాలో నీట్(పీ.జీ) పరీక్షకు 265 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. కాగా, అర్సపల్లిలోని ఏవీ ఎంటర్ ప్రైజెస్, మల్లారంలోని షిఫ్ట్ టెక్నాలజీస్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను కలెక్టర్ సందర్శించి నిశిత పరిశీలన జరిపారు. పరీక్షా కేంద్రాల్లో సరిపడా కంప్యూటర్లు, సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ ధృవీకరణ పరికరాలు, ఇంటర్నెట్ కనెక్షన్ ఇత్యాది సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని గమనించారు.

విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా చూడాలని, పరీక్షా కేంద్రాలలో తాగునీరు, వైద్య సదుపాయాలు సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. నీట్(పీజీ) పరీక్ష నిర్వహణలో ఎలాంటి తప్పిదాలు, లోటుపాట్లకు తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఎగ్జామ్ సెంటర్ల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నీట్(పీ.జీ) పరీక్ష కొనసాగుతుందని, అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్డీఓ రాజేంద్రకుమార్, డీఈవో అశోక్, డీఐఈవో రవికుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ, ఏసీపీ ప్రకాశ్, తహసీల్దార్లు వినయ్ కుమార్, హరికిషోర్, కలెక్టరేట్ ఏవో బాలరాజు తదితరులు ఉన్నారు.

# గుడ్లవల్లేరు మండలంలో రూ.4.17 కోట్లతో రోడ్ల అభివృద్ధి

అమరావతి, ఆగష్టు 29:గుడ్లవల్లేరు మండలంలో సాస్కి నిధులతో రూ.4.17 కోట్లతో చేపట్టిన పలు రోడ్ల అభివృద్ధి పనులకు గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శ్రీకారం చుట్టారు. కూటమి నాయకులతో కలిసి ఆయా గ్రామాల్లో రోడ్ల నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. విన్నకోట, కట్టవాని చెరువు గ్రామాల్లో ఇప్పటికే రూ.74 లక్షల నిధులతో రోడ్ల అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. తాజాగా పోలిమెట్ల నుంచి పెంజంద్ర వరకు రూ.1.10 కోట్లతో, కౌతవరం నుంచి చేవెంద్ర వరకు రూ.1.80 కోట్లతో, గాదెపూడి ఎం.ఎన్.కె. రహదారికి రూ.57 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు.

చాలాకాలంగా రోడ్లు అధ్వానంగా ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు గతంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు తెలిపిన సమస్యలను గుర్తించి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించడంపై గ్రామస్థులు ఎమ్మెల్యే రాముకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా గుడివాడ నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామాల పర్యటనల్లో ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన రోడ్ల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని చెప్పారు.

గత వైసీపీ ప్రభుత్వం రోడ్ల నిర్వహణ, అభివృద్ధిపై నిర్లక్ష్యం చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా రహదారుల పరిస్థితి దారుణంగా మారిందని ఎమ్మెల్యే విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

సీఎం చంద్ర బాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో మారుమూల గ్రామాలకు సైతం మెరుగైన రహదారి సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మంచి రహదారులు ఉంటే గ్రామాల మధ్య రాకపోకలు సులభతరం కావడంతో పాటు రైతులు పంటలను మార్కెట్లకు తరలించేందుకు, విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు, అత్యవసర సమయాల్లో వైద్య సేవలు పొందేందుకు ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు.

గుడివాడ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడమే తన లక్ష్యమని రాము తెలిపారు. రోడ్ల సమస్యలపై ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సహకారంతో ఇప్పటికే పలు రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టామని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.

ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమాల్లో గుడివాడ జనసేన ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డు చైర్మన్ పొట్లూరి రవి, మండల టీడీపీ అధ్యక్షుడు పోలవరపు వెంకటరావు, టీడీపీ నాయకులు వల్లభనేని వెంకట్రావు, చేకూరు జగన్మోహనరావు, కొడాలి రామరాజు, శ్రీ కొండలమ్మ అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ ఈడే మోహన్, గోవాడ శివ, అబ్దుల్ సత్తార్, తూము పద్మజ, పామర్తి సత్తిబాబు, ఆయా గ్రామాల నాయకులు, కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# విశాఖ లారీ డ్రైవర్ ఘటనపై సమగ్ర విచారణ

-ఎడిట్ వీడియో ఆధారంగా ఏఎంవిఐని దోషిగా తేల్చొద్దు
-పూర్తి దృశ్యాలు, సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించాలి
-ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలతో వాస్తవాలు నిగ్గుతేల్చాలి
-తప్పు నిర్ధారణైతే చర్యలకు వ్యతిరేకం కాదు
-రవాణా సాంకేతిక అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. ప్రవీణ్

విజయవాడ, ఆగష్టు 29: విశాఖపట్నంలో లారీ డ్రైవర్‌పై దాడి ఘటనకు సంబంధించి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వీడియోలోని కొంత భాగాన్ని ఆధారంగా చేసుకుని అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ)ను బాధ్యుడిగా నిర్ధారించడం సరికాదని ఆంధ్రప్రదేశ్ రవాణాశాఖ సాంకేతిక అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి ఎండీఎల్ సిద్దిక్ అన్నారు. ఘటనపై నిష్పాక్షికంగా, సమగ్రంగా దర్యాప్తు చేసి వాస్తవాలను వెలుగులోకి తేవాలని కోరారు. విజయవాడ బందరు రోడ్డులోని డీటీసీ కార్యాలయ ప్రాంగణంలోని అసోసియేషన్ భవనంలో శనివారం వారు ప్రకటన విడుదల చేశారు.

ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోకూడదన్నారు. పూర్తి వాస్తవాలు వెలుగులోకి రాకముందే పరిమిత లేదా ఎడిట్ చేసిన దృశ్యాల ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగిని దోషిగా చిత్రీకరించడం సరికాదని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రచారంలో ఉన్న వీడియోలో లారీ క్యాబిన్‌లో డ్రైవర్‌పై జరుగుతున్న దాడి దృశ్యాల్లో ఏఎంవీఐ ప్రత్యక్షంగా దాడి చేస్తున్నట్లు కనిపించడం లేదని ఆయన తెలిపారు. అక్కడ ఉన్న కారు డ్రైవర్ పాత్రకు సంబంధించిన దృశ్యాలు మాత్రమే కనిపిస్తున్న నేపథ్యంలో పూర్తి ఘటనను పరిశీలించకుండా ఏఎంవీఐపై నిందలు మోపడం సరికాదన్నారు.

ఘటనకు సంబంధించిన పూర్తి వీడియో ఫుటేజీతోపాటు అందుబాటులో ఉన్న సీసీ కెమెరా దృశ్యాలు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, ఘటనకు ముందు?తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు, సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలను సమగ్రంగా పరిశీలించాలని పోలీసులను కోరారు. రవాణాశాఖ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో భాగంగా ప్రజలతో నిత్యం ప్రత్యక్షంగా వ్యవహరిస్తుంటారని, వివాదాలు తలెత్తినప్పుడు చట్టపరమైన మార్గాల్లోనే పరిష్కరించుకోవాలని సూచించారు. ఎవరైనా తప్పు చేసినట్లు ఆధారాలతో నిర్ధారణ అయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడాన్ని సంఘం వ్యతిరేకించదని, అయితే అసంపూర్ణ వీడియోలు లేదా అపోహల ఆధారంగా ఎవరినీ బాధ్యులుగా నిలబెట్టడం సమర్థనీయం కాదని ప్రవీణ్ స్పష్టం చేశారు.

# ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో జాతీయ క్రీడాకారులుగా ఎదగాలి

అమరావతి, ఆగష్టు 29:మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ పిలుపునిచ్చారు. శనివారం అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అవనిగడ్డ ఉపవిభాగ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మండలి వెంకట్రామ్ మాట్లాడుతూ ధ్యాన్‌చంద్ గొప్ప క్రీడాకారుడిగా దేశానికి మూడు ఒలింపిక్ పతకాలు అందించడంతో పాటు భారతదేశానికి సేవ చేసిన మహనీయుడని కొనియాడారు.

ఆయన జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవ స్ఫూర్తితో విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న క్రీడలో రాణించి జాతీయ స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. క్రీడల ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు మానసిక వికాసం కలుగుతుందని అన్నారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని, గెలుపోటములను స్వీకరించే నైపుణ్యం జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనేలా చేస్తుందని తెలిపారు.

విద్య, క్రీడలకు ప్రాధాన్యమిచ్చే దివిసీమ ప్రాంతానికి చెందిన విద్యార్థులు అన్ని రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. అనంతరం నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కబడ్డీ పోటీల్లో స్వతంత్రపురం జెడ్పీ ఉన్నత పాఠశాల బాలురు, బాలికలు విజేతలుగా నిలిచి బహుమతులు అందుకున్నారు. కార్యక్రమాన్ని సంఘం అధ్యక్షుడు బీవీ వెంకటేశ్వరరావు, కార్యదర్శి బీపీఎల్ ప్రసాద్, కోశాధికారి తోట నవీన్, వ్యాయామ ఉపాధ్యాయులు నిర్వహించారు.

జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన క్రీడా జ్యోతిని మండలి వెంకట్రామ్ వెలిగించి క్రీడా ర్యాలీని ప్రారంభించారు. వందలాది మంది విద్యార్థులు త్రివర్ణ పతాకాలు, క్రీడా పతాకాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు మేజర్ ధ్యాన్‌చంద్‌కు ఘనంగా నివాళులర్పించారు. జాతీయ పతాకాలతో సాగిన ర్యాలీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక .. చిన్న పరిశ్రమలు

ఆగస్టు 30వ తేదీని భారత దేశంలో చిన్న పరిశ్రమల దినోత్సవంగా జరుపుకుంటారు. దేశ ఆర్థిక వ్యవస్థలో చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల ప్రాధాన్యాన్ని గుర్తించి వాటి అభివృద్ధి, సవాళ్లు, అవకాశాలపై చర్చించుకునే సందర్భమిది. చిన్న పరిశ్రమలు కేవలం ఉత్పత్తి యూనిట్లుగానే కాకుండా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలను కల్పిస్తూ గ్రామీణాభివృద్ధికి దోహదం చేస్తాయి. స్వదేశీ ఉత్పత్తుల ఆధారంగా దేశ ఆర్థిక వ్యవస్థకు బలం చేకూర్చే ప్రధాన ఆధారంగా నిలుస్తాయి. స్వాతంత్ర్యం అనంతరం భారతదేశం ఆత్మనిర్భర దిశగా పయనించే క్రమంలో చిన్న పరిశ్రమల ప్రాముఖ్యత మరింత పెరిగింది. పెద్ద పరిశ్రమలకు విస్తారమైన మూలధనం, ఆధునిక యంత్రాంగం అవసరమవుతుంటే చిన్న పరిశ్రమలు తక్కువ పెట్టుబడితో పరిమిత వనరులను వినియోగించి స్థానిక అవసరాల కనుగుణంగా అభివృద్ధి చెందగల సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. అందువల్లే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చిన్న స్థాయి యూనిట్లు విస్తృతంగా పెరిగి ఉపాధి, ఉత్పత్తి రంగాల్లో ప్రభావాన్ని చూపుతున్నాయి.

చిన్న పరిశ్రమల దినోత్సవం చరిత్రను పరిశీలిస్తే 2000వ సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ఈ రంగం కోసం సమగ్ర విధాన ప్యాకేజీని ప్రకటించింది. రుణ సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు, సాంకేతిక సహాయం వంటి అంశాలు ఆ ప్యాకేజీలో భాగమయ్యాయి. ఆ సందర్భంలో ఆగస్టు 30న ఢిల్లీలో జాతీయ సదస్సు జరిగింది. దేశ వ్యాప్తంగా ఉన్న చిన్న పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్న ఆ సదస్సు ఈ రంగానికి చారిత్రక మలుపు తీసుకొచ్చింది. దానికి గుర్తుగా ప్రతి సంవత్సరం ఆగస్టు 30ని చిన్న పరిశ్రమల దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించారు.

చిన్న పరిశ్రమలు భారతదేశ ఆర్థికాభివృద్ధిలో గణనీయమైన పాత్ర పోషిస్తున్నాయి. వ్యవసాయ రంగం తరువాత అత్యధిక ఉపాధి కల్పిస్తున్న రంగం ఇదే. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో లక్షలాది కుటుంబాలకు జీవనోపాధి అందిస్తున్నాయి. దేశ స్థూల దేశీయోత్పత్తిలో సుమారు 30 శాతం వాటా ఈ రంగానిదే. తయారీ, సేవల రంగాల్లో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయి. భారత దేశం నుంచి జరిగే ఎగుమతుల్లో దాదాపు 40 శాతం వాటా చిన్న పరిశ్రమల ఉత్పత్తులదే. తోలు వస్తువులు, చేనేత వస్త్రాలు, హస్త కళలు, యంత్ర భాగాలు వంటి ఉత్పత్తులు విదేశీ మారక ద్రవ్యం సంపాదించడంలో ముఖ్య భూమిక వహిస్తున్నాయి. అదే విధంగా చిన్న

### ఆగస్టు 30...చిన్న పరిశ్రమల దినోత్సవం




పరిశ్రమలు దేశంలోని అన్ని ప్రాంతాల్లో విస్తరించి ఉండడం వల్ల ప్రాంతీయ అసమానతలను తగ్గించడంలో కూడా ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. వెనుక బడిన ప్రాంతాల ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నాయి.

ప్రభుత్వం చిన్న పరిశ్రమల అభివృద్ధి కోసం అనేక పథకాలు చేపట్టింది. ముద్ర యోజన ద్వారా తక్కువ వడ్డీకే రుణాలను అందజేస్తూ కొత్తగా వ్యాపారాలు ప్రారంభించే ఔత్సాహికులను ప్రోత్సహిస్తోంది. 'ఉద్యమ్ రిజిస్ట్రేషన్' పోర్టల్ ద్వారా పరిశ్రమల నమోదు ప్రక్రియను సులభతరం చేసింది. 'మేక్ ఇన్ ఇండియా', 'స్టార్ట్–అప్ ఇండియా', 'వొకల్ ఫర్ లోకల్' వంటి కార్యక్రమాల ద్వారా స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ కొత్త అవకాశాలను కల్పిస్తోంది. యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చే 'స్కిల్ ఇండియా మిషన్' కూడా చిన్న పరిశ్రమల్లో ఉపాధి పొందేందుకు దోహదం చేస్తోంది. ఈ దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా సదస్సులు, వర్క్‌షాప్‌లు, అవార్డుల ప్రదానోత్సవాలు జరుగుతాయి. చిన్న పారిశ్రామిక వేత్తలు, నిపుణులు తమ అనుభవాలను పంచుకుంటారు.

అయితే చిన్న పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళు కూడా అనేకం. నాణ్యమైన ముడిసరుకు కొరత, రుణ సౌకర్యాల లోపం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేకపోవడం, గ్లోబల్ మార్కెట్ పోటీ, దిగుమతుల ఒత్తిడి వంటి సమస్యలు వాటి ఎదుగుదలకు అడ్డంకులుగా మారుతున్నాయి. ముఖ్యంగా కోవిడ్?19 సమయంలో అనేక చిన్న పరిశ్రమలు మూత పడటంతో ఉపాధి కోల్పోయిన కుటుంబాలు ఎన్నో. దీని ద్వారా ఈ రంగాన్ని కేవలం ప్రోత్సాహక పథకాలతో కాకుండా దీర్ఘకాల వ్యూహాలతో, మౌలిక సదుపాయాల బలోపేతంతో ముందుకు నడిపించాల్సిన అవసరం స్పష్టమవుతుంది.

చిన్న పరిశ్రమల దినోత్సవం మనకు గుర్తుచేసేది... దేశ ఆర్థికాభివృద్ధి లోనూ, సామాజిక సమానత్వం సాధించడం లోనూ ఈ రంగం కీలకమైందని. పెద్ద పరిశ్రమలు ఇవ్వలేని స్థానిక ఉపాధిని చిన్న పరిశ్రమలు అందిస్తున్నాయి. సమాజంలో స్థిరత్వం, ఆర్థిక సమతౌల్యం వీటి ద్వారానే సాధ్యమవుతుంది. అందువల్ల చిన్న పరిశ్రమల అభివృద్ధి జాతీయాభివృద్ధికి అనివార్యమైన భాగమని ఈ రోజు మనందరికీ గుర్తు చేస్తుంది. పరిశ్రమాధారుల సృజనాత్మకత, శ్రమ శక్తికి ప్రభుత్వ మద్దతు లభిస్తేనే ఆత్మ నిర్భర భారత్ స్వప్నం సాకారం అవుతుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలపరచి భారత దేశాన్ని ప్రపంచ పరిశ్రమల పటంలో శక్తివంతమైన స్థానంలో నిలపగల ప్రధాన అస్త్రం చిన్న పరిశ్రమలేనని ఈ దినం మనకు సంకల్పాన్ని కలిగిస్తుంది.



–రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

## సిరిసిల్లలో వాలీబాల్, కబడ్డీ, ఆర్చరీ పోటీలు



రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 29:(నేటినిజం ప్రతినిధి): మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని సిరిసిల్ల మినీ స్టేడియంలో శనివారం నిర్వహించారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ హైదరాబాద్ ఆదేశాలు, జిల్లా కలెక్టర్ అనుమతితో వాలీబాల్, కబడ్డీ, ఆర్చరీ పోటీలు నిర్వహించారు.పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులతో పాటు గోల్డ్, సిల్వర్ మెడల్స్, మెమెంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. జాతీయస్థాయిలో వివిధ క్రీడాంశాల్లో పాల్గొని విజయం సాధించిన 20 మంది క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు.జిల్లా విద్యాధికారి మొండయ్య, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ కిరణ్‌కుమార్ విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఏ. రాందాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ నోడల్ అధికారి డి. ప్రభాకర్, వాలీబాల్, కబడ్డీ కోచ్‌లు, క్రీడాకారులు, తల్లిదండ్రులు, యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలి.

## అనుసంధాన రహదారులను పూర్తి చేసి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి

## అదనపు కలెక్టర్ రెవెన్యూ సి. హెచ్. మహేందర్



ములుగు ఆగష్టు 29:(నేటినిజం ప్రతినిధి): జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు అవసరమైన రోడ్డు భద్రతా చర్యలను పటిష్టంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ సి. హెచ్. మహేందర్ జి సంబంధిత అధికారులను ఆదేశించారు.

శనివారం అదనపు కలెక్టర్ రెవెన్యూ సి. హెచ్. మహేందర్ జి అధ్యక్షతన నూతన కలెక్టరేట్ తన ఛాంబర్ లో రోడ్డు భద్రతా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారిపై మల్లంపల్లి, పందికుంట, యువజన శిక్షణ కేంద్రం, జాకారం, నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంతాల్లో అవసరమైన చోట్ల వేగ నియంత్రణ పట్టీలు, సూచిక బోర్డులు,రేడియం స్టికర్లు, ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

జాతీయ రహదారికి అనుసంధానమయ్యే రహదారుల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆయా అనుసంధాన ప్రాంతాల వద్ద వాహనదారులకు స్పష్టంగా కనిపించేలా సూచిక, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఆర్ టి ఓ ఈశ్వర్ సింగ్ ఠాగూర్, నేషనల్ హైవే, ఆర్ అండ్ బి, పి ఆర్ ఇంజనీరింగ్ అధికారులు, ఎక్సైజ్ సి ఐ సుధీర్ కుమార్, మునిసిపల్ కమిషనర్ సంపత్, ఆర్టి సి, పోలీస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వానికి నరకడం తప్ప నాటడం తెలియదు : ఎమ్మెల్సీ నాగబాబు

అమరావతి, ఆగష్టు 29:ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన జనసేన ఎమ్మెల్సీ నాగబాబు.. గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వానికి చెట్లు నరకడం తప్ప, నాటాలనే ఆలోచన రాలేదని అన్నారు. తమది నరికే సంస్కృతి కాదని, నాటే సంస్కృతి అని స్పష్టంచేశారు. హరితాంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం మంగళగిరిలోని అరణ్యారామం నందవనంలో నిర్వహించిన 'అశ్వత్థ నారాయణ వివాహం' కార్యక్రమంలో నాగబాబు తన అర్థాంగి పద్మజతో కలిసి పాల్గొన్నారు.ఉ వనీణతీజీజూఫ్త్రతిఇ ఖీవటవతీవనిఇవ

శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం ఆయన దంపతులు రావి–వేప మొక్కలను నాటారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ.. భూమాతను కాపాడుకోవడం మనందరి బాధ్యతని గుర్తుచేశారు. అడవుల నరికివేత, విచక్షణారహిత మైనింగ్ వంటి చర్యలతో మనమే భూమాతను గాయపరుస్తున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. పర్యావరణ పరిరక్షణ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తోపాటు తనకు ఒకేరకమైన ఆలోచనలు ఉన్నాయని నాగబాబు తెలిపారు. రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే ఉమ్మడి సంకల్పమే తమను ఒకే వేదికపైకి తెచ్చిందని అన్నారు.

భారతీయ సంప్రదాయంలో రావి, వేప చెట్లకు విశిష్ట స్థానం ఉందని, వాటిని కలిపి నాటడం వల్ల జీవవైవిధ్య పరిరక్షణకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. అనంతరం రూ.24 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 'అరణ్యారామం' భవన డిజైన్లను నాగబాబు పరిశీలించారు. ఈ భవన నిర్మాణాన్ని 10 నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామని పీసీసీఎఫ్ చీఫ్ పీవీ చలపతిరావు ఆయనకు వివరించారు. ఈ నిర్మాణం కోసం తొలగించాల్సి వచ్చిన 73 చెట్లను నరికివేయకుండా.. వేరేచోట విజయవంతంగా పునఃప్రతిష్ఠాపన చేయడంపై ఆయన అధికారులను అభినందించారు.

# గీత కార్మికుల సంక్షేమానికి చేయూత

## వన మహోత్సవంలో ఈత మొక్కలు నాటిన సర్పంచ్, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు

ములుగు ఆగష్టు 29:(నేటినిజం ప్రతినిధి): ఏటూరు నాగారం లోని గీత కార్మికుల ఆర్థికాభివృద్ధి మరియు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని, వారికి చేయూత అందించే లక్ష్యంతో అటవీ శాఖ (ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్) మరియు డిఆర్డిఎ ఆధ్వర్యంలో ఏటూరు నాగారం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ప్రత్యేక 'వన మహోత్సవం' కార్యక్రమాన్ని నిర్వహించారు.బి

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ శ్రీమతి కాకులమర్రి శ్రీలత గారు, ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీ కాకులమర్రి లక్ష్మణ్ బాబు గారు హాజరై, అటవీ శాఖ అధికారులతో కలిసి మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథులు సర్పంచ్ కాకులమర్రి శ్రీలత గారు బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకుల మరి లక్ష్మణ్ బాబు గారు మరియు ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారులు మాట్లాడుతూ... గీత కార్మికుల జీవనోపాధిని పెంపొందించేందుకు అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఈత, మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ మొక్కలు భవిష్యత్తులో పెరిగి గీత కార్మికులకు ఎంతో ఆసరాగా నిలుస్తాయని తెలిపారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించి, పర్యావరణ పరిరక్షణతో పాటు గీత కార్మికుల భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని ఆశించారు.

ఈ కార్యక్రమంలో కాకులమర్రి ప్రదీప్ రావు గారు, ఎండి వలీ బాబా, చైర్మన్ కూనూరు అశోక్ గౌడ్ గారు, సప్పిడి రాంనర్సయ్య,తురం పద్మ, ఉప సర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, కార్యదర్శి జనార్ధన్, కన్నబోయిన రాజు యాదవ్, గౌడ సంఘం నాయకులు సప్పిడి రామ్ గారు, కొండల్, రఘు, మొగిలి, పాలకుర్తి విజయ్, తాళ్ల పెల్లి మోహన్, మెరుపు వెంకటేశ్వర్లు, సది, కొండాయి చిన్ని, అటవీ శాఖ అధికారులు, గౌడ సంఘ నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# భీమేశ్వర స్వామికి మంత్రి పొన్నం, విప్ ఆది పూజలు



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 29:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న వారికి అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆశీర్వచనం అందించగా, ఆలయ డిప్యూటీ ఈవో ప్రతాప నవీన్‌కుమార్ శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాలు అందజేశారు.తెలంగాణ సుభిక్షంగా ఉండాలని ప్రార్థనరాష్ట్రంలో కరువు కాటకాలు లేకుండా పాడిపంటలతో ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని భీమేశ్వర స్వామిని ప్రార్థించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కొత్తకొండ వీరభద్రస్వామి దర్శనం అనంతరం భీమేశ్వర స్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు శ్రీనివాస్‌శర్మ, పీఆర్వో పెరిక శ్రీనివాస్, అర్చకులు, వేద పండితులు, ఆలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన గౌతమ్ మోడల్ స్కూల్ విద్యార్థికి సన్మానం

## –అభినందించిన స్కూల్ యజమాన్యం



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 29:(నేటినిజం ప్రతినిధి): మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని సిరిసిల్ల మినీ స్టేడియంలో శనివారం నిర్వహించారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ హైదరాబాద్ ఆదేశాలు, జిల్లా కలెక్టర్ అనుమతితో జాతీయస్థాయిలో వివిధ క్రీడాంశాల్లో పాల్గొని విజయం సాధించిన 20 మంది క్రీడాకారులను సన్మానించారు. జాతీయస్థాయిలో కరాటే పోటీల్లో వేములవాడ గౌతమ్ మోడల్ స్కూల్ కు చెందిన సిహెచ్ సూర్య సుశీను జిల్లా విద్యాధికారి మొండయ్య, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ కిరణ్‌కుమార్ జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఏ. రాందాస్ సన్మానించి మెమొంటో అందజేశారు. అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ నోడల్ అధికారి డి. ప్రభాకర్, కరాటే మాస్టర్లు అబ్దుల్ మన్నాన్, శ్రీనివాస్, వాలీబాల్, కబడ్డీ కోచ్‌లు, క్రీడాకారులు, తల్లిదండ్రులు, యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం సన్మాన గ్రహీత కు గౌతమ్ మోడల్ స్కూల్ కరిస్పాండెంట్ బూర ఉమా రమేష్ అభినందించారు

# కబడ్డీ పోటీలను విజయవంతం చేయాలి- విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 29:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో సెప్టెంబరు 26 నుంచి 29 వరకు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. పోటీల నిర్వహణ సన్నాహకాలపై శుక్రవారం త్రినేత్ర ఫంక్షన్‌హాల్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని 33 జిల్లాలతోపాటు హైదరాబాద్‌కు చెందిన జట్టు కలిపి బాలుర విభాగంలో 34, బాలికల విభాగంలో 34 జట్లు పాల్గొంటాయని తెలిపారు. సుమారు 1,358 మంది క్రీడాకారులు, సిబ్బందితో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యువత క్రీడా మైదానాల్లో ఎక్కువ సమయం గడపాలనే ఉద్దేశంతో సీఎం కప్ నిర్వహిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను పండుగ వాతావరణంలో నిర్వహించి, జాతీయస్థాయిలో రాణించే క్రీడాకారులను తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు.రాష్ట్ర మంత్రులు శ్రీహరి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు తదితరులు పోటీలకు హాజరుకానున్నారని తెలిపారు. జిల్లా ప్రజలు, క్రీడాభిమానులు పెద్దఎత్తున పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

# క్రీడలతో ఆరోగ్యం.. క్రమశిక్షణతో ఉన్నత భవిష్యత్

మహబూబ్‌నగర్, ఆగష్టు 29: విద్యార్థులు క్రీడల్లో చురుగ్గా పాల్గొని శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని ఊట్కూర్ సర్పంచ్ ఎం.రేణుక భరత్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూర్యప్రకాష్‌రెడ్డి, ఉప సర్పంచ్ రమేష్, జిల్లా క్రీడల అధికారి శెట్టి వెంకటేష్, వాలీబాల్ జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జగదీష్‌గౌడ్ సూచించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలో వేడుకలు నిర్వహించారు. వివేకానంద చౌరస్తా వద్ద విద్యార్థులతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా విద్యార్థులు, యువత భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు.

చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మంత్రి వాకిటి శ్రీహరి సహకారంతో మండలంలో క్రీడాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఊట్కూర్‌కు చెందిన దాత అబ్దుల్ మునీర్ రూ. 25 వేల విలువైన రెజ్లింగ్ మ్యాట్లు, షటిల్ రాకెట్లను అందజేయడం అభినందనీయమన్నారు. క్రీడా సామగ్రి అందుబాటులోకి రావడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు, యువతకు క్రీడల్లో సాధన చేసేందుకు మరింత అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రతిరోజూ కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించడం ద్వారా ఆరోగ్యంగా ఉండటంతో పాటు చెడు అలవాట్లకు దూరంగా ఉండవచ్చని తెలిపారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.